తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | శనివారం-17- మే - 2025 | సంపుటి : 2 | సంచిక : 356 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in




# పిల్లలమర్రి విహారానికి మిస్ వరల్డ్ అందాల సందడి

- పిల్లలమర్రి మైమరపించే మహావృక్షం
- మహబూబ్‌నగర్‌లోని 700 ఏళ్ల ప్రాచీన వృక్షాన్ని సందర్శించిన మిస్ వరల్డ్ గ్రూప్-2
- బతుకమ్మ-బోనాల సందడి మధ్య సుందరీమణులు
- తెలంగాణ జానపద కళలతో మమేకమై డోలు, బంజారాల నృత్యాలతో పర్యాటక అనుభూతి
- ఎక్స్‌పీరియం ఎకో పార్క్ – పర్యావరణానికి పాఠశాల
- చిన్నారులతో కలిసి మొక్కలు నాటిన పోటీదారులు
- ఏఐజీ ఆసుపత్రిలో ఆరోగ్య సందేశాలు
- ఆధునిక వైద్య సేవలను పరిశీలించిన మిస్ వరల్డ్ టీం



8లో..



# భవిష్యత్ విద్యుత్ అవసరాలకు ప్రణాళికలు సిద్ధం చేయండి

**విధివిధాల అభివృద్ధితో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్ : సీఎం రేవంత్**

**పునరుత్పాదక విద్యుత్‌పై దృష్టి సారించాలని సీఎం సూచన..**

**160 కిలోమీటర్ల ఓఆర్ఆర్ పొడవునా సౌర విద్యుత్ ఆధారిత లైటింగ్ ఏర్పాటుకు ఆదేశం**

- గృహ, ఐటీ, పారిశ్రామిక అవసరాల దృష్టిలో పెరుగుతున్న వినియోగం
- గత ఏడాదితో పోలిస్తే 9.8% డిమాండ్ పెరుగుదల
- క్లీన్ ఎనర్జీ పై దృష్టి.. ఫ్లోటింగ్ సోలార్‌కు ప్రాధాన్యం
- పునరుత్పాదక విద్యుత్‌పై దృష్టి సారించాలని సీఎం సూచన
- పంప్డ్ స్టోరేజ్, ఫ్లోటింగ్ సోలార్, గ్రీన్ ఎనర్జీ పాలసీ అమలు
- వికాసానికి అనుగుణంగా మౌలిక వసతుల ప్రణాళికలు
- డేటా సెంటర్లు, మెట్రో, రైల్వే విస్తరణలకు విద్యుత్ ప్రణాళికలు
- నీటిపారుదల ప్రాజెక్టులకు విద్యుత్ సరఫరా పకడ్బందీగా ఉండాలని సూచన
- సబ్‌స్టేషన్ల అప్‌గ్రేడ్ – ఆధునిక విద్యుత్ లైన్లకు ప్రాధాన్యం
- డిమాండ్‌కు అనుగుణంగా వ్యవస్థను అభివృద్ధి చేయాలి
- భూగర్భ విద్యుత్ లైన్లు, హైటెన్షన్ మార్గాల పునఃస్థాపనపై దృష్టి
- ఫ్యూచర్ సిటీలో భూగర్భ విద్యుత్, స్మార్ట్ పోల్స్ ఏర్పాటు
- ఫ్యూచర్ సిటీలో బహిరంగ విద్యుత్ మౌలిక వసతులు లేకుండా ప్రణాళిక
- సచివాలయం, కేబీఆర్ పార్కు ప్రాంతాల్లో స్మార్ట్ పోల్స్ ప్రయోగాత్మకంగా



హైదరాబాద్ (తెలంగాణ ముచ్చట్లు)

గతంలో ఎన్నడూ లేనంతగా రాష్ట్రంలో విద్యుత్తు డిమాండ్ పెరిగిందని, రాబోయే భవిష్యత్తు అంచనాలు, అవసరాలకు తగినట్లుగా విద్యుత్తు సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మునుపెన్నడూ లేని విధంగా రాష్ట్రానికి వెల్లువెత్తిన పెట్టుబడులు, రాబోయే రోజుల్లో తెలంగాణలో జరగబోయే పారిశ్రామిక అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని భవిష్యత్తు ప్రణాళిక తయారు చేసుకోవాలని దిశా నిర్దేశం చేశారు. పరిశ్రమలతో పాటు గ్లోబల్ కెపాబులిటీ సెంటర్లు, డేటా సెంటర్లు, మాస్ ట్రాన్స్‌పోర్టేషన్ (మెట్రో, ఎలక్ట్రికల్ వెహికిల్స్) దృష్టిలో ఉంచుకొని పునరుత్పాదక విద్యుత్‌పై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. భవిష్యత్తు విద్యుత్ అవసరాలను ముందస్తుగా అంచనా వేసి రోడ్ మ్యాప్ సిద్ధం చేసుకోవాలని అధికారులకు సూచించారు.

రాష్ట్రంలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు, ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుల వల్ల వచ్చే మూడేండ్లలో

మిగతా 2లో..



# శత్రు దాడులపై సురక్షిత కవచం

- ఎస్-400 సుదర్శన చక్రం – రష్యా సృష్టించిన అపార శక్తి
- పాక్ దాడులకు దీటుగా తిప్పికొట్టిన అత్యాధునిక గగనతల రక్షణ వ్యవస్థ
- డేవిడ్ స్లింగ్ – అమెరికా–ఇజ్రాయెల్ సంయుక్త శక్తి
- 300 కిమీ దూరంలోని లక్ష్యాలను ఛేదించే మోస్టెర్న్ టెక్నాలజీ
- ఎస్-300వీఎమ్ – రష్యా బాలిస్టిక్ మిసైల్ కిల్లర్
- 200 కిమీ రేంజ్‌తో శక్తివంతమైన రక్షణ వ్యవస్థ
- థాడ్ – అమెరికా మిసైల్ తుపాకీ
- 150 కిమీ ఎత్తులోని లక్ష్యాలను తుపాకీల్లా తుత్తునియలు చేసే సామర్థ్యం
- పాట్రియట్ ఎమ్ఐఎమ్-104 – అమెరికా టెక్ మాజిక్
- క్రూయిజ్ మిసైళ్లు, టాక్టికల్ బాలిస్టిక్ మిసైళ్లను తిప్పికొట్టే టాప్ సిస్టమ్
- హెచ్‌క్యూ-9 – చైనా సిద్ధం చేసిన రష్యా కాపీ
- 125 కిమీ రేంజ్‌తో యుద్ధ విమానాలు, మిసైళ్లకు ఎదురొడ్డి నిలిచే శక్తి

న్యూఢిల్లీ (తెలంగాణ ముచ్చట్లు)

శత్రుదేశాలు ప్రయోగించిన క్షిపణులు, యుద్ధ విమానాలు, డ్రోన్ల వంటి వాటిని తుత్తునియలు చేసే ఆయుధ వ్యవస్థనే ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్ లేదా గగనతల రక్షణ వ్యవస్థ అని అంటారు. పాక్ దాడులను దీటుగా తిప్పికొట్టిన 'ఎస్400' సుదర్శన చక్ర గురించి అందరికీ తెలిసిందే. మరి ప్రపంచంలో ఇలాంటి టాప్ గగనతల రక్షణ వ్యవస్థలు ఏవో ఈ కథనంలో తెలుసుకుందాం. డేవిడ్ స్లింగ్ వ్యవస్థను అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా అభివృద్ధి చేసుకున్నాయి.

మిగతా 2లో..

# చివరి గింజ వరకు మద్దతు ధర పై ధాన్యం కొనుగోలు..

రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రివర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి

**ధాన్యం కొనుగోలు, రేషన్ కార్డుల జారీపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన మంత్రి**

4లో..



# భారత రక్షణ దళాల పరాక్రమానికి సంఘీభావాన్ని

తెలిపిన దక్షిణ మధ్య రైల్వే

హైదరాబాద్ (తెలంగాణ ముచ్చట్లు)

దక్షిణ మధ్య రైల్వే సివిల్ డిఫెన్స్ నేతృత్వంలో శుక్రవారం 'ఆపరేషన్ సిందూర్' విజయానికి గుర్తుగా, సికింద్రాబాద్‌లోని దక్షిణ మధ్య రైల్వే (ఎస్.సి.ఆర్.) ప్రధాన కార్యాలయం రైల్ నిలయం నుండి సంగీత్ జంక్షన్ వరకు మరియు తిరిగి రైల్ నిలయం వరకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించడమైనది. దక్షిణ మధ్య రైల్వే సివిల్ డిఫెన్స్ కంట్రోలర్ డిప్యూటీ జనరల్ మేనేజర్ (జి) శ్రీ ఉదయనాథ్ కోట్ల బీ భారత్ స్కౌట్స్ గైడ్స్ రాష్ట్ర కార్యదర్శి మరియు దక్షిణ మధ్య రైల్వే డిప్యూటీ చీఫ్ మెటీరియల్స్ మేనేజర్ శ్రీ ఎ.కె.రావత్‌బీ డిప్యూటీ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ శ్రీ ఎస్.ఆర్. షెల్కేతో పాటు ఇతర అధికారులు, రైల్వే సిబ్బంది, దక్షిణ మధ్య రైల్వే స్కౌట్స్ గైడ్స్ నుండి వాలంటీర్లు మరియు ఆర్. పి. ఎఫ్ సిబ్బంది ఫ్లాగ్ మార్చ్‌లో పాల్గొన్నారు.

మిగతా 2లో..



# గాజాలో మానవ మేధోమేఘం: వరుసగా మూడో రోజు ఇజ్రాయెల్ దాడులు

- 64 మంది మృతి, వందలమంది గాయపడినట్లు ఆరోగ్య శాఖ సమాచారం
- డీర్ అల్-బాలా, ఖాన్ యూనిస్‌పై వైమానిక దాడులు
- డజన్ల సంఖ్యలో ప్రాణాలు కోల్పోయిన గాజా నివాసితులు
- భీకర బాంబుల మోత.. నిద్రలేని రాత్రులు
- గురువారం రాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజామున వరకు నిరంతర దాడులు

2లో..



# ధరణి వల్ల రైతులు నిద్రలేని రాత్రులు గడిపారు

హైదరాబాద్ (తెలంగాణ ముచ్చట్లు)

ధరణి పోర్టల్ వల్ల రైతులు నిద్రలేని రాత్రులు గడిపారని, గత ప్రభుత్వం చేసిన నిర్వాకం వల్ల తొందరపాటు వల్ల వారి ప్రమేయం లేకుండానే రైతులు శిక్షను అనుభవించారని రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం నాడు నిర్మల్ ఆసిఫాబాద్ జిల్లాల్లో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి శ్రీమతి సీతక్క తో కలిసి

మిగతా 2లో..

తెలంగాణ
TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# భవిష్యత్ విద్యుత్ అవసరాలకు ప్రణాళికలు సిద్ధం చేయండి

(మొదటి పేజీ తరువాయి)



విద్యుత్ డిమాండ్ పెరుగుతుందని ముఖ్యమంత్రి అధికారులను అప్రమత్తం చేశారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మూడేండ్ల విద్యుత్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని ముఖ్యమంత్రి దిశా నిర్దేశం చేశారు. గత ఏడాదితో పోలిస్తే విద్యుత్ డిమాండ్ 9.8శాతం పెరిగింది. గతంలో ఎన్నడూ లేని విధంగా రికార్డు స్థాయిలో ఈ సంవత్సరం విద్యుత్ డిమాండ్ పెరిగింది. ఇది ఒక గొప్ప విజయం. అయినప్పటికీ అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం ఆదర్శంగా నిలిచిందని అన్నారు. ఈ ఏడాది అత్యధికంగా 17,162 మెగావాట్లకు విద్యుత్ డిమాండ్ చేరుకుంది. 2025 26 లో 18,138 మెగావాట్లు, 2034.35 నాటికి 31,808 మెగావాట్ల కు విద్యుత్ డిమాండ్ పెరుగుతుందని భవిష్యత్తు అవసరాలు, అంచనాలను అధికారులు ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి నివేదించారు.

జూబ్లీహిల్స్ లోని సీఎం నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, సీఎంవో ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, ట్రాన్స్కో సీఎండీ కృష్ణ భాస్కర్, ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ, టీజీ రెడ్కో ఎండీ అనిల ఈ సమావేశంలో పాల్గొన్నారు. పెరుగుతున్నవిద్యుత్తు అంచనాలకు సరిపడేలా విద్యుత్తు ఉత్పత్తిని పెంచుకోవాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ప్రధానంగా క్లీన్ ఎనర్జీ, పంప్డ్ స్టోరేజ్ పైన దృష్టి సారించాలని అన్నారు. ఫ్లోటింగ్ సోలార్ విద్యుత్ ఉత్పత్తికి ఉన్న అన్ని అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని, కొత్తగా అమల్లోకి తెచ్చిన క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీపైన దృష్టి సారించాలని చెప్పారు.

విద్యుత్ ఉత్పత్తి లో ప్రఖ్యాతిగాంచిన ప్రపంచ దిగ్గజ సంస్థలకు అవకాశం ఇవ్వాలని అన్నారు. రాష్ట్రంలో నిర్మించే నీటిపారుదల ప్రాజెక్టుల విద్యుత్ అవసరాలను దృష్టి లో ఉంచుకోవాలని, మెట్రో విస్తరణ, రైల్వే లైన్లు, ఇతర మాస్ ట్రాన్స్ పోర్ట్ ల విద్యుత్ అవసరాలను పరిగణనలోకి తీసుకోవాలని చెప్పారు.

గ్రేటర్ హైదరాబాద్ తో పాటు ఇతర కార్పొరేషన్ల విద్యుత్ అవసరాల ను పరిగణనలోకి తీసుకోవాలని, కొత్త గా ఏర్పాటు చేయబోయే డేటా సెంటర్లు, పారిశ్రామిక వాడలకు కావాల్సిన విద్యుత్ అవసరాలను దృష్టి లో ఉంచుకోవాలని చెప్పారు. గ్లోబల్ కెపాబులిటీ సెంటర్ల హబ్?గా హైదరాబాద్ దేశంలో అందరి దృష్టిని ఆకర్షిస్తోందని అన్నారు.

భవిష్యత్తులో డేటా సెంటర్ల హబ్ గా మారబోతుందని, హైదరాబాద్ లో డేటా సిటీ ఏర్పాటు చేయబోతున్నామని ముఖ్యమంత్రి అన్నారు. అవుటర్ రింగ్ రోడ్డు నుంచి రీజనల్ రింగ్ రోడ్డు వరకు రేడియల్ రోడ్లు, శాటిలైట్ టౌన్ షిప్ లకు కావాల్సిన విద్యుత్ అవసరాలపైన హెచ్ఎండీఏ తో సమన్వయం చేసుకోవాలని విద్యుత్తు శాఖ అధికారులకు సూచించారు. క్షేత్రస్థాయిలో విద్యుత్ డిమాండ్ కు అనుగుణంగా సబ్ స్టేషన్లను అప్ గ్రేడ్ చేసుకోవాలి. విద్యుత్ లైన్ల ఆధునీకరణ పైన దృష్టి సారించాలని.. ఫ్యూచర్ సిటీ లో పూర్తి భూగర్భ విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. ఫ్యూచర్ సిటీలో విద్యుత్ టవర్లు, పోల్స్, లైన్స్ బహిరంగంగా కనిపించడానికి వీల్లేదని, హై టెన్షన్ లైన్ల ను కూడా అక్కడి నుంచి తరలించాల్సి ఉంటుందని గుర్తు చేశారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో స్మార్ట్ పోల్స్ ను ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. సెక్రెటేరియట్, నక్లెస్ రోడ్, కేబీఆర్ పార్కు వంటి ప్రాంతాల్లో ముందుగా ప్రయత్నించాలన్నారు. 160 కిలో మీటర్ల అవుటర్ రింగ్ రోడ్ పొడవునా సోలార్ విద్యుత్ వినియోగించుకునే ప్రణాళిక ఉండాలని, జీహెచ్ఎంసీ పరిధిలోని ఫుట్ పాత్ లు, నాలా ల్లో సోలార్ విద్యుత్ ఉత్పత్తికి ఉన్న అవకాశాలను పరిశీలించాలన్నారు.

# భారత రక్షణ దళాల పరాక్రమానికి సంఘీభావాన్ని

(మొదటి పేజీ తరువాయి)

'ఆపరేషన్ సింధూర్' విజయంపై ప్రజల్లో అవగాహన కల్పించడం మరియు ఉగ్రవాదాన్ని అణచివేయడంలో భారత సాయుధ దళాలు ప్రదర్శించిన వ్యూహాత్మక శక్తి మరియు పరాక్రమానికి సంఘీభావాన్ని తెలియజేయడం ఈ ఫ్లాగ్ మార్చ్ యొక్క లక్ష్యం. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ మాట్లాడుతూ, ఈ ఫ్లాగ్ మార్చ్ దేశం పట్ల మన నిబద్ధతను మరియు వీర సైనికులకు మన సంఘీభావాన్ని తెలుపుతుందని అన్నారు. రక్షణ బలగాల పరాక్రమానికి దక్షిణ మధ్య రైల్వే సెల్యూట్ చేస్తూ ఉగ్రవాదంపై పోరులో వారికి అండగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు.

# శత్రు దాడులపై సురక్షిత కవచం

(మొదటి పేజీ తరువాయి)



300 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలనూ ఇది ధ్వంసం చేయగలదు. 15 కిలోమీటర్ల ఎత్తువరకూ ఉన్న టార్గెట్‌లను నాశనం చేస్తుంది. రష్యాకు చెందిన ఎస్300వీఎమ్ వ్యవస్థ బాలిస్టిక్ మిసైళ్లు ధ్వంసం చేసేందుకు ఉద్దేశించినది. దీని రేంజ్ 200 కిలోమీటర్లు. 30 కిలోమీటర్ల ఎత్తు నుంచి వస్తున్న క్షిపణులను ధ్వంసం చేస్తుంది. అమెరికాకు చెందిన థాడ్ వ్యవస్థ.. శత్రదేశ క్షిపణులను సమర్థవంతంగా తిప్పికొడుతుంది. 200 కిలోమీటర్ల పరిధిలోని 150 కిలోమీటర్ల ఎత్తు వరకూ ఉన్న అన్ని టార్గెట్‌స్‌ను ధ్వంసం చేస్తుంది. అమెరికా క్షిపణి విధ్వంసక వ్యవస్థకు ఇది ఎంతో కీలకం.

ఇక అమెరికాకు చెందిన మరో గగనతల రక్షణ వ్యవస్థ ఎమ్ఐఎమ్104 పాట్రియట్ కూడా గొప్ప సామర్థ్యం కలది. యుద్ధ విమానాలు, క్రూయిజ్ మిసైళ్లు, టాక్టికల్ బాలిస్టిక్ మిసైళ్ల నుంచి రక్షణ లభిస్తుంది. దీని రేంజ్ 170 కిలోమీటర్లు. గరిష్ఠంగా 24 కిలోమీటర్ల ఎత్తులోని శత్రుదేశ ఆయుధాలను ఇది ధ్వంసం చేయగలదు.

రష్యాకు చెందిన ఎస్300 స్ఫూర్తితో చైనా హెచ్‌క్యూ9 గగనతల రక్షణ వ్యవస్థను తయారు చేసింది. దీని రేంజ్ 125 కిలోమీటర్లు. గరిష్ఠంగా 27 కిలోమీటర్ల ఎత్తులోని టార్గెట్‌లను ఇది ధ్వంసం చేయగలదు. యుద్ధ విమానాలు మొదలు క్రూయిజ్ మిసైల్స్ వరకూ అనేక ఆయుధాలను ఇది నాశనం చేస్తుంది. ఫ్రాన్స్, ఇటలీ సంయుక్తంగా ఆస్టర్ 30 ఎస్ఏఎమ్‌పీ/టీ గగనతల రక్షణ వ్యవస్థను రూపొందించాయి. ఇది థియేటర్ లెవెల్ రక్షణ వ్యవస్థ. గరిష్ఠంగా 120 కిలోమీటర్ల దూరంలో 20 కిలోమీటర్ల ఎత్తున ఉన్న యుద్ధ విమానాలు, మిసైళ్లు, డ్రోన్లను ధ్వంసం చేయగలదు.

ఎమ్ఈఏడీఎస్ అనేది మధ్యశ్రేణి గగనతల రక్షణ వ్యవస్థ. అమెరికా, జర్మనీ, ఇటలీ సంయుక్తంగా దీన్ని నిర్మించాయి. ఇది గరిష్టంగా 70 కిలోమీటర్ల దూరంలో 20 కిలోమీటర్ల ఎత్తున ఉన్న లక్ష్యాలను నాశనం చేస్తుంది. 360 డిగ్రీల రక్షణ కల్పిస్తుంది. రహదారుల పైనుంచీ ప్రయోగించేలా దీన్ని సిద్ధం చేశారు.

ఇజ్రాయెల్, భారత్ కలిసి రూపొందించిన గగనతల రక్షణ వ్యవస్థ బరాక్8. ఇది గరిష్ఠంగా 100 కిలోమీటర్ల దూరంలో 20 కిలోమీటర్ల ఎత్తున ఉన్న లక్ష్యాలను ఛేదిస్తుంది. 360 డిగ్రీల రక్షణ కల్పించే ఈ వ్యవస్థతో యుద్ధ విమానాలు, మిసైల్స్, డ్రోన్‌స్‌ను ధ్వంసం చేయొచ్చు.

# ధరణి వల్ల రైతులు నిద్రలేని రాత్రులు గడిపారు

(మొదటి పేజీ తరువాయి)



భూభారతి అవగాహన సదస్సుల్లో మంత్రి గారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ భూభారతి చట్టం అమలులో భాగంగా ట్రిబ్యునల్స్ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. భూభారతి నాలుగు పైలట్ మండలాల్లో 13వేల దరఖాస్తులు వచ్చాయని వీలైనంతవరకూ ఈనెల 30వ తేదీలోగా పరిష్కరించవలసిన ప్రతి సమస్యను పరిష్కరిస్తామని వెల్లడిరచారు. తహసిల్దార్, ఆర్డిఓ, అదనపు కలెక్టర్, కలెక్టర్, సీసీఎల్ఏ, ఆపై ట్రిబ్యునల్ స్థాయిలలో అప్పీల్ వ్యవస్థను ఈ చట్టం అనుసరించి రూపొందించినట్లు తెలిపారు.ప్రజలకు రెవెన్యూశాఖ సేవలు సులభంగా, పారదర్శకంగా అందుబాటులోకి తేవడమే లక్ష్యంగా ప్రభుత్వం కార్యాచరణను అమలు చేస్తుందని పేర్కొన్నారు. భూభారతి కార్యక్రమం ద్వారా భూ సంబంధిత సమస్యల పరిష్కారం వేగవంతంగా జరగడమే కాకుండా, రైతులకు నమ్మకమైన భూ సమాచారం అందుతోందని మంత్రి తెలిపారు. వాస్తవిక డేటాతో భూ పత్రాలను సమర్పించడం వల్ల భవిష్యత్తులో హక్కులపై ఆందోళనలు తలెత్తవని స్పష్టం చేశారు.ఉద్దేశ్యపూర్వకంగా భూ సమస్యలను అ పరిష్కృతంగా ఉంచుతే సంబంధిత అధికారులపై చర్యలు ఉంటాయన్నారు. భూ యజమానుల భూ కమతాలకు మ్యాపులను పట్టాదారు పాసుపుస్తకంలో ముద్రించి ఇస్తామని తెలిపారు. ఆరువేల మంది లైసెన్సు కలిగి ఉన్న సర్వేయర్లను అధికారికంగా నియమిస్తున్నామని చెప్పారు. దీంతో భూముల హద్దుల గుర్తింపు ప్రక్రియ సులభతరం అవుతుందని అన్నారు. అలాగే త్వరలోనే గ్రామ రెవెన్యూ అధికారులను నియమిస్తున్నామని అన్నారు. భూములు ఉన్న ప్రతి ఒక్కరికి భూభారతి చట్టం ద్వారా రక్షణ ఏర్పడుతుందని అన్నారు. పట్టా లేని భూములను సాగు చేసుకుంటున్న అర్హులైన పోడు భూముల రైతులకు పట్టాలు అందజేస్తామని అన్నారు. ఈ సమావేశాల్లో సిసిఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్లపై ఆందోళన వద్దు

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని అన్నారు. తొలి విడతలో ఇండ్లు రానివారు ఆందోళన చెందవద్దని అన్నారు. మొదటి విడతగా ప్రతీ నియోజక వర్గానికి 3500 చొప్పున ఇందిరమ్మ ఇళ్లు కేటాయించామని, మరో నాలుగు విడతల్లో కూడా ఇందిరమ్మ ఇండ్లను అందిస్తామని మంత్రి పొంగులేటి అన్నారు.

# గాజాలో మానవ మేధోమేఘం: వరుసగా మూడో రోజు ఇజ్రాయెల్ దాడులు

- 64 మంది మృతి, వందలమంది గాయపడినట్లు ఆరోగ్య శాఖ సమాచారం
- డీర్ అల్-బాలా, ఖాన్ యూనిస్‌పై వైమానిక దాడులు
- డజన్ల సంఖ్యలో ప్రాణాలు కోల్పోయిన గాజా నివాసితులు
- భీకర బాంబుల మోత.. నిద్రలేని రాత్రులు
- గురువారం రాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజామున వరకు నిరంతర దాడులు



(తెలంగాణ ముచ్చట్లు)

గాజాలో ఇజ్రాయెల్ మారణహోమాన్ని సృష్టిస్తోంది. వరుసగా మూడోరోజు భీకర దాడులకు పాల్పడింది. గురువారం రాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజామున వరకు వైమానిక దాడులతో విరుచుకుపడింది. ఈ దాడుల్లో డజన్ల కొద్దీ ప్రజలు ప్రాణాలు కోల్పోయినట్లు అక్కడి ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు.

డీర్ అల్‌బాలా, ఖాన్ యూనిస్ నగర శివారుల్లో ఇజ్రాయెల్ దళాలు భీకర దాడులకు పాల్పడినట్లు అధికారులు తెలిపారు. ఈ దాడుల్లో 64 మంది ప్రాణాలు కోల్పోయినట్లు చెప్పారు. 48 మృతదేహాలను ఇండోనేషియా ఆసుపత్రికి తరలించగా.. మరో 16 మృతదేహాలను నాజర్ ఆసుపత్రికి తరలించినట్లు అధికారులు వెల్లడించారు. ఇక ఈ దాడుల్లో వంద మందికిపైగా గాయపడినట్లు చెప్పారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పశ్చిమాసియా పర్యటనలో ఉండగా.. ఐడీఎఫ్ దళాలు గాజాపై వరుస దాడులకు పాల్పడుతుండటం గమనార్హం.

గాజాపై ఇజ్రాయెల్ దాడులు చేయడం ఇది వరుసగా మూడోరోజు. దక్షిణ గాజాలోని ఖాన్ యూనిస్ నగరంపై బుధగురువారాల మధ్య రాత్రి ఇజ్రాయెల్ నిర్వహించిన దాడుల్లో 54 మంది మరణించారు. మృతుల్లో ఓ పాత్రికేయుని కుటుంబ సభ్యుల్లో 11 మంది కూడా ఉన్నారు. అంతకుముందు మంగళవారం రాత్రి బుధవారం తెల్లవారుజామున మధ్య జరిగిన దాడుల్లో 22 మంది చిన్నారులు సహా మొత్తం 70 మంది ప్రాణాలు కోల్పోయారు. ఫలితంగా గత మూడు రోజుల వ్యవధిలోనే ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో గాజాలో 180 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఇటీవలే మాట్లాడుతూ.. గాజాలో యుద్ధాని ఆపడానికి ఎలాంటి మార్గం లేదని వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. హమాస్ ఉగ్రవాద సంస్థను అంతం చేసే వరకు గాజా స్ట్రిప్‌లో యుద్ధం కొనసాగుతుందన్నారు. దీంతో కాల్పుల విరమణపై అవకాశాలు సన్నగిల్లాయి.









తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక





## పందిళ్ళపల్లి మత్స్య సహకార సొసైటీ అక్రమాలను అరికట్టాలి

- సొసైటీ అధ్యక్ష కార్యదర్శులు, కమిటీని రద్దు చేయాలి
- కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు చేస్తున్న మత్స్య శాఖ ఏడి
- విలేకరుల సమావేశంలో బాధితులు

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:** ఖమ్మం జిల్లా చింతకాని మండలం పందిళ్ళ పల్లి (పెద్దచెరువు) మత్స్య సహకార సొసైటీలో గత 12 ఏండ్లుగా జరుగుతున్న అక్రమాలను అరికట్టాలని, వారసత్వ సభ్యత్వం పేరుతో వసూళ్లకు పాల్పడిన సొసైటీ అధ్యక్ష కార్యద ర్శులు, కమిటీని రద్దు చేయాలని బాధితులు సింగారపు వీరమల్లు, సింగారపు వీరభద్రం, లింగం సైదులు అన్నారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... పందిళ్ళపల్లి (పెద్దచెరువు) మత్స్య సహకార సొసైటీలో సుమారు 149 మంది సభ్యులు ఉన్నారన్నారు. సొసైటీ అధ్యక్ష కార్యదర్శులుగా లింగబోయిన వెంకటేశ్వర్లు(బుజ్జి), షేక్ సైజాని, 9 మంది సభ్యులు ఉన్నారన్నారు. సొసైటీ 149 మంది సభ్యులలో సుమారు 48 మంది తండ్రులు చనిపోతే వారసత్వంగా వారి కొడుకులకు సభ్యత్వం పేరుతో రూ. 6వేల నుండి ఎక్కువ మొత్తంలో వసూలు చేసి సభ్యత్వం ఇవ్వకుండా మత్స్య శాఖ ఏడికి ఇతరులకు ఇచ్చామని 12 ఏళ్లుగా కాలయాపన చేస్తూ మోసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇట్టి విషయమై మత్స్య శాఖ ఏడికి మూడుసార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదన్నారు. గ్రీవెన్స్ లో కలెక్టర్కు ఫిర్యాదు చేశామని, కలెక్టర్ ఆదేశాలు కూడా మత్స్య శాఖ ఏడి బేఖాతర్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారసత్వ సభ్యత్వం పేరుతో నాలుగైదు లక్షలు, అదేవిధంగా కొత్త సభ్యుల పేరుతో 50 మంది దగ్గర రూ.50 వేల రూపాయలను పందిళ్ళపల్లి మత్స్య శాఖ సహకార సొసైటీ, మత్స్యశాఖ ఏడి సహకారంతోనే ఈ వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. గతంలో అక్రమాలకు పాల్పడిన ఏడి సస్పెండ్ అయిన అధికారులకు బుద్ధి రావట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అధికారులు విచారణ జరిపి న్యాయం చేయాలని బాధితులు వేడుకున్నారు.

# జిల్లా ,రాష్ట్రాల సరిహద్దులో ఏడు చెక్ పోస్టులు ఏర్పాటు

- పశువుల రవాణా విషయంలో నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు
- పోలీస్ కమిషనర్ సునీల్ దత్

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:** పశువుల అక్రమ రవాణాను అరికట్టడానికి ఖమ్మం కమిషనరేట్ పరిధిలోని జిల్లా, రాష్ట్రాల సరిహద్దులో ఏడు చెక్ పోస్టులు ఏర్పాటు చేసినట్లు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు.

శుక్రవారం పోలీస్ అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ .. 24x7 నిరంతర పర్యవేక్షణలో వుండేవిధంగా జిల్లా, రాష్ట్రాల సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన ఈ ప్రత్యేక చెక్ పోస్టులలో పోలీసు, పశుసంవర్ధక శాఖ సిబ్బందితో షిఫ్ట్ ల వారిగా సమన్వయంతో పనిచేస్తాయని, పశువులను అక్రమంగా తరలిస్తే కేసులు నమోదు చేస్తారని తెలిపారు.



శాంతిభద్రతల పరిరక్షణ కోసం ముందస్తు చర్యలలో భాగంగా పశువుల రవాణా విషయంలో వివాదాలు తలెత్తకుండా ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ముఖ్యంగా జంతువుల అక్రమ రవాణా, గోవధ విషయంలో నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పదని అన్నారు. ప్రధానంగా బక్రీద్ పండుగ సందర్భంగా పశువుల రవాణా విషయంలో అవసరమైన అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని, చట్ట విరుద్ధంగా ఆవులు,దూడలను రవాణా చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు ఆదేశించారు. పశువులను రవాణాచేసే ప్రతి వాహనానికి తగు నిర్ధారిత ప్రమాణిక పత్రాలు (వాలిడ్ డాక్యుమెంట్స్) ఉండాలని స్పష్టం చేశారు. సరిహద్దు రాష్ట్రాల నుండి రవాణా అయ్యే పశువుల విషయంలోనూ నియమ, నిబంధనలను క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. సరైన పత్రాలు వారి వెంట ఉన్నాయనే విషయాన్ని పరిశీలించి అనుమతించాలని, అక్రమ రవాణా చేస్తే చర్యలు తీసుకోవాలని చెప్పారు. పండుగల సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో సామాజిక మాధ్యమాల ద్వారా మత సామరస్యానికి భంగం కలిగించే విధంగా విద్వేషాలు, రెచ్చగొట్టే, అసభ్యకర పోస్టులు పెట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు మీడియా మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా మతపెద్దలతో శాంతి సమీక్షా సమావేశాలు నిర్వహించి, భద్రతా పరంగా ఎలాంటి సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామని తెలిపారు. పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా, మత సామరస్యంతో జరుపుకునేలా అవసరమైన చోట్ల ముందస్తుగా పటిష్టమైన పోలీసు బందోబస్తు, కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా అక్రమ రవాణా నియంత్రించేందుకు నిఘా విభాగం అప్రమత్తంగా వుంటుందని, చెక్ పోస్టుల తనిఖీలే కాకుండా జిల్లా కేంద్రంలో సైతం ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తారని అన్నారు. ఎవరైనా అక్రమ రవాణా చేస్తూ పట్టుబడితే వారి వాహనాలు సీజ్ చేస్తారని అన్నారు.

**సరిహద్దు చెక్ పోస్టులు**

పాలడుగు (వైరా) భస్వాపూరం క్రాస్ రోడ్డు (కొణిజర్ల )హనుమాన్ తండా (కల్లూరు )వెంకటగిరి క్రాస్ రోడ్డు (ఖమ్మం రూరల్) సుబ్లేడ్ క్రాస్ రోడ్డు (తిరుమలాయపాలెం ) పాలేరు సింగరేణిపల్లి ప్లాజా (కూసుమంచి )వల్లభి (ముదిగొండ )



## మల్లూరు కుటుంబానికి సీపీఎం అండ!

- జిల్లా నేతలతో మాట్లాడి నాణ్యమైన వైద్యం అందిస్తాం: శీలం

**సత్తుపల్లి, ఆర్ సి, తెలంగాణ ముచ్చట్లు:** వేంసూరు మండలం సీపీఎం పార్టీ సీనియర్ నేత, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు, సీనియర్ జర్నలిస్టు మల్లూరు చంద్రశేఖర్ సతీమణి వెంకటేశ్వరి ఎడమ కాలు ఫ్యాక్చర్ అయిన విషయం విదితమే. సమాచారం తెలుసుకున్న సత్తుపల్లి డివిజన్ సీపీఎం కార్యదర్శి శీలం సత్యనారాయణరెడ్డి, సీపీఎం ఖమ్మం జిల్లా కమిటి సభ్యులు జాజిరి శ్రీనివాస్, సత్తుపల్లి పట్టణ సీపీఎం కార్యదర్శి కొలికపోగు సర్వేశ్వరరావు శుక్రవారం వేంసూరు మండల పరిధిలోని మర్లపాడు గ్రామం లో మల్లూరు చంద్రశేఖర్ సతీమణి ను పరామర్శించారు. సీపీఎం పార్టీ అండగా ఉంటుందని, జిల్లా నేతలతో మాట్లాడి ఖమ్మం నగరంలో నాణ్యమైన వైద్యం అందించే దానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. వెంటనే జిల్లా నేత విక్రమ్ తో చరవాణి లో శీలం సంభాషించి సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జమ్ముల ఉమా మహేశ్వరరావు, మల్లెల్లి చెన్నారావు, శివకుమారి, సృజన పాల్గొన్నారు.




## తెలంగాణ మైనారిటీ గ్రామీణ వైద్యుల సంఘం 11వ మహాసభ కరపత్రాల ఆవిష్కరణ..

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**

స్థానిక టిటిడిసి హాల్ హవేలీ రెస్టారెంట్ ఎదురుగా వైరా రోడ్ ఖమ్మం నందు ఈనెల 22 గురువారం న జరిగే తెలంగాణ మైనారిటీ గ్రామీణ వైద్యుల సంఘం 11వ మహాసభను పురస్కరించుకొని శుక్రవారం రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్యాంప్ కార్యాలయ ఇంచార్జ్ తంబూరి దయాకర్ రెడ్డి కరపత్రాలను ఆవిష్కరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం తెలంగాణ మైనారిటీ గ్రామీణ వైద్యుల సంఘం నిర్వహిస్తున్న మహాసభ కార్యక్రమాలు సంఘ బాధ్యుల అంకిత భావాన్ని చాటి చెబుతున్నాయని అన్నారు, గ్రామీణ వైద్యులకు తన అభినందనలు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు షేక్ హసన్ మరియు జిల్లా జనరల్ సెక్రెటరీ షేక్ జానీ మియా లతోపాటు వ్యవస్థాపకులు షేక్ నజీరుద్దీన్, జిల్లా గౌరవ అధ్యక్షులు షేక్ హసన్, సంఘ జిల్లా నాయకులు అఫ్జల్ మియా, మన్సూర్ అలీ, ఇస్సాక్ పాషా, సుల్తాన్ బాబా, నాగుల్ మీరా, సోందుమియా, అహ్మద్, ఆశ, చాంద్ పాషా మహమ్మద్, ఖాసీం, అమీర్, శ్రీరామ్ గిరి జానీ, సహజహాన్, ఇమామ్, సైదా, ఖలీల్, మహిమూద్, యాసీన్, రహీం,హమీద్ అలీ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు



## మే 22, 23 తేదీలలో సిపిఎం శిక్షణ తరగతులను జయప్రదం చేయండి

- చిట్యాల సోమన్న, మదార్

**పాలకుర్తి,తెలంగాణ ముచ్చట్లు:** ఈరవెన్ను గ్రామంలో మే 22, 23 తేదీలలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న సిపిఎం రాజకీయ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని జిల్లా కమిటీ సభ్యులు చిట్యాల సోమన్న, మండల కమిటీ సభ్యులు ఏదునూరి మదార్ కోరారు. శుక్రవారం ఈరవెన్నులో శిక్షణ తరగతుల కరపత్రాన్ని ఆవిష్కరించిన అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో కొనసాగుతున్న దోపిడి వ్యవస్థను పారద్రోలేందుకు, సోషలిస్టు సమాజ నిర్మాణం కోసం ప్రజలను చైతన్యం చేయడమే తమ లక్ష్యమన్నారు. అసంఘటిత కార్మికులకు రక్షణ కల్పించే విధానాలు రూపొందించాలన్నారు. ఉద్యోగులు, రైతులు, దళితులు, గిరిజనులు, ఆదివాసుల సమస్యల పరిష్కారానికి సిపిఎం నిరంతరం పోరాడుతోందన్నారు.తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో సాధించిన భూములను ప్రాజెక్టుల పేరుతో లాక్కుంటూ కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని హరించుతోందని విమర్శించారు. అలాగే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆరు గ్యారెంటీలను నెరవేర్చడంలో విఫలమైందన్నారు. పెండింగ్‌లో ఉన్న పెన్షన్లు, ఇండ్ల స్థలాలు, రేషన్ కార్డులు, విద్యా-వైద్య రంగ సమస్యల పరిష్కారం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని అన్నారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇల్లు కల్పించాలి, వడగండ్ల వర్షాలకు నష్టపోయిన రైతులకు తగిన నష్టపరిహారం అందించాలి అని డిమాండ్ చేశారు. భవిష్యత్ పోరాటాలకు కార్యకర్తలను సిద్ధం చేయడానికి, రాజకీయంగా చైతన్యం కల్పించడానికి ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో కొంతం సాయిలు, జక్కుల శోభన్ బాబు, జక్కుల రాజు, జావాజీ అబ్బసాయిలు తదితరులు పాల్గొన్నారు.



## జర్నలిస్టు మల్లూరు సతీమణిను పరామర్శించిన సీఐటీయూ రాష్ట్ర నేత చలమాల!

- ఆర్థిక స్థితి బాగోలేక మంచానికే పరిమితం!
- మనో ధైర్యం కల్పించిన కామ్రేడ్లు!

**సత్తుపల్లి, ఆర్ సి, తెలంగాణ ముచ్చట్లు:** వేంసూరు మండలం మర్లపాడు గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్టు మల్లూరు చంద్రశేఖర్ సతీమణి నీ పరామర్శించిన సిఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు,సీపీఐ (ఎం) ఖమ్మంజిల్లా కమిటి సభ్యులు చలమాల విఠల్ రావు.

ఖమ్మం జిల్లా సీఐటీయూ ఉపాధ్యక్షులు వేంసూరు మండల కార్యదర్శి, సీనియర్ జర్నలిస్టు మల్లూరు చంద్రశేఖర్ సతీమణి వెంకటేశ్వరి ఈ నెల 11నా ప్రమాదవశాత్తు ఎడమ కాలు మెలి తిరిగి కింద పడిపోగా కాలు వాపు వచ్చి నడవలేని దుస్థితి ఏర్పడింది. వైద్యం కోసం సత్తుపల్లి లో ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యులు చూపించగా సర్జరీ చేయాలని, ప్లేట్స్ అమర్చాలని మెరుగైన వైద్యం కోసం ఖమ్మం లేక హైదరాబాద్ కు తీసుకువెళ్లాలని సూచించారు.

మల్లూరు ఆర్థిక పరిస్థితి బాగోలేక మెరుగైన వైద్యం అందించే స్థితి లేక భార్య గృహంలో మంచానికి పరిమితమైనది. కార్మిక నేత చంద్రశేఖర్, కుమార్తె సృజన లు వెంకటేశ్వరి కు సేవ చేస్తూ కాలం గడుపుతున్నారు. విషయం తెలుసుకున్న సిఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు,సీపీఐ (ఎం) ఖమ్మంజిల్లా కమిటి సభ్యులు చలమాల విఠల్ రావు బుధవారం మల్లూరు సతీమణి ను స్వయంగా కలసి పరామర్శించారు. అధైర్య పడవద్దని సిపిఎం, సిఐటియు లు అండగా ఉంటాయని పై కమిటి నేతలతో చర్చించి సహకారం చేస్తామని కామ్రేడ్లు హామీ ఇచ్చారు. విఠల్ తో పాటు సత్తుపల్లి డివిజన్ సీపీఎం కమిటి సభ్యులు పెనుబల్లి మండల సీపీఎం కార్యదర్శి,గాయం తిరుపతిరావు, పెనుబల్లి మండల కమిటి సభ్యులు తడికమళ్ళ చిరంజీవి, మర్లపాడు గ్రామ సీపీఎం కార్యదర్శి దంకర శ్రీను తిరునగరి సూర్యం లు వున్నారు.




## వరంగల్ అర్బన్ సహకార బ్యాంకు సేవలను వినియోగించుకోవాలని పిలుపునిచ్చిన సంజీవరెడ్డి

**హనుమకొండ, తెలంగాణ ముచ్చట్లు:**

వరంగల్ అర్బన్ సహకార బ్యాంకు అందిస్తున్న సేవలను ప్రజలు విస్తృతంగా వినియోగించుకోవాలని హనుమకొండ జిల్లా సహకార అధికారి బి. సంజీవరెడ్డి సూచించారు. అంతర్జాతీయ సహకార సంవత్సరాన్ని పురస్కరించుకుని శుక్రవారం ప్రశాంత్ నగర్‌లోని వరంగల్ అర్బన్ సహకార బ్యాంకు బ్రాంచ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా సభ్యులు, డిపాజిటర్లతో సమావేశమై సంజీవరెడ్డి మాట్లాడుతూ — ప్రతి సభ్యుడు స్వయం సహాయం, సమిష్టి బాధ్యత, సమానత్వం, సామాజిక బాధ్యత వంటి విలువలతో బ్యాంకు అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజా బ్యాంకుగా ఈ బ్యాంకును అభివృద్ధి చేసి, అందులో లభించే అన్ని సేవలను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

పొదుపు చేయడం ద్వారా వాటాదారులుగా మారి బ్యాంకు పరపతిని పెంచడంలో అందరూ భాగస్వాములవ్వాలని తెలిపారు. బ్యాంకులో లాకర్లు, కోర్ బ్యాంకింగ్ సిస్టం, ఏటీఎంలు, ఇతర అన్ని ఆధునిక సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. ఈ సమావేశంలో బ్యాంకు ముఖ్య కార్యనిర్వాహణాధికారి ప్రసాద్, మేనేజర్ సురేందర్ రెడ్డి, హనుమకొండ బ్రాంచ్ మేనేజర్ ప్రసాద్, గోపాలపురం మేనేజర్ శ్రీనివాస్, డిపార్ట్మెంట్ అధికారులు శ్రీనివాసరావు, కృష్ణవేణి, సంధ్యారాణి, బ్యాంకు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




## మక్కాకు బయలుదేరిన బాల్యమిత్రుని భార్యను సన్మానించిన చిన్నారెడ్డి

**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:**

వనపర్తి పట్టణానికి చెందిన రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి బాల్య స్నేహితుడు ఎం ఏ. రవూఫ్ యొక్క భార్య పవిత్ర మక్కాకు బయల్దేరారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి ఆమెను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా చిన్నా రెడ్డి మాట్లాడుతూ... ఇస్లాం ఐదు సూత్రాలలో మక్కా యాత్ర ఐదవదని అన్నారు.ప్రతి ఒక్క ముస్లిం సోదరులు ఒక్క సారైన మక్కా హజ్ యాత్ర చేయాలన్నారు.సం. కాలంలో ఎప్పుడైనా హజ్ యాత్ర చేస్తే వాటిని ఉమ్రా అంటారన్నారు.ముస్లిం సోదరులు జిల్లెల చిన్నా రెడ్డికి అల్లా ఆశీస్సులు ఎప్పుడూ ఉండాలని ముస్లిం సోదరులు ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో చిన్నారెడ్డి బాల్య స్నేహితులు బాబన్న,ఎం ఏ రవూఫ్ వాళ్ల బంధుమిత్రులు,ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లిపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



## ఇరాని కేఫ్ ను సందర్శించిన బాలసాని

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**

ఖమ్మం నగరం లోని 3 టౌన్ ప్రాంతం లో రేగు రవీందర్ ఆధ్వర్యంలో నూతనంగా ప్రారంభించిన ఇరాని కేఫ్ ను మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ సందర్శించారు. రవీందర్ స్వయంగా చేసిన టీ సేవించి చాలా బాగున్నదని అన్నారు. యువత స్వయం ఉపాధి సాధించుకోవాలనే సదుద్దేశం తో హైదరాబాద్ తరహాలో సోదరుడు రేగు రవీందర్ ఏర్పాటు చేసిన ఇరాని కేఫ్ చాలా బాగున్నదని, మీ వ్యాపారం బాగా అభివృద్ధి చెంది మంచి పురోగతి సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సింగం అంజయ్య, సిటీ కాంగ్రెస్ ఓబీసీ చైర్మన్ బాణాల లక్ష్మణ్, నగర కాంగ్రెస్ నాయకులు వాలబోయిన వెంకటేశ్వర్లు,కురుమ సంఘం నగర అధ్యక్షులు దేవర వెంకన్న, తొగరు భాస్కర్, ఏనుగు మహేష్ షేక్ జాకీర్, ఎమ్మె రామకృష్ణ, మన్నె హరికృష్ణ, మేచిని రామకృష్ణ. , చిట్టెం శెట్టి శ్రీనాథ్ నాయుడు, నూనె శశిధర్, తదితరులు పాల్గొన్నారు.

## దాతృత్వం చాటుకున్న ఎంపీ రవిచంద్ర

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**




బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర తన విశాల హృదయాన్ని, దయాగుణాన్ని, దాతృత్వాన్ని మరోసారి చాటుకున్నారు. బతుకుదెరువు కోసం పొట్ట చేతబట్టుకుని ఉన్న ఊరు వదిలి గల్ఫ్ బాట పట్టిన నల్లగొండ జిల్లాకు చెందిన ఒక వ్యక్తి అక్కడ అకాల మృత్యువుకు లోనయ్యారు. అతని మృతదేహాన్ని స్వస్థలానికి తీసుకువచ్చే స్థోమత లేక కుటుంబ సభ్యులు ఎంపీ రవిచంద్రను సంప్రదించడంతో ఆయన వెంటనే స్పందించి అందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు.మరిన్ని వివరాల్లోకి వెళితే... నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడు గ్రామానికి చెందిన శ్రీరాములు బతుకుదెరువు కోసం సౌదీ అరేబియా వెళ్లారు.ఇటీవల అనారోగ్యానికి గురైన ఆయన రియాద్ లోని ఒక ఆస్పత్రిలో చేరి వైద్య సేవలు పొందుతూనే తుది శ్వాస విడిచారు. విషయం కుటుంబ సభ్యులకు తెలియడంతో శ్రీరాములు మృతదేహాన్ని స్వస్థలానికి తెప్పించడం ఎలాగో,ఎవరిని కలవాలో,అందుకు ఎంత ఖర్చవుతుందో తెలియక, ఆర్థిక స్థోమత లేక దిక్కుతోచని పరిస్థితుల్లో స్థానిక బీఆర్ఎస్ నాయకుల సాయంతో ఎంపీ వద్దిరాజు రవిచంద్రను సంప్రదించడం జరిగింది.ఆయన వెంటనే సానుకూలంగా స్పందించి వారిని ఓదార్చి మనోధైర్యాన్నిస్తూ, అందుకు అవసరమైన అధికారులతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతూ తగు ఏర్పాట్లు చేశారు.ఇందుకు గాను ఖర్చైన సుమారు 3 లక్షలు రూపాయలను ఎంపీ రవిచంద్ర భరించారు. దీంతో మృతదేహం విమానంలో హైదరాబాద్ ,ఆ తర్వాత బుధవారం రాత్రి స్వస్థలం వెలిమినేడు చేరింది. శ్రీరాములు కుటుంబ, సభ్యులు, బంధుమిత్రులు, స్థానికులు ఎంపీ వద్దిరాజుకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

## ప్రజలకు సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించడమే ఆర్టీఐ ఫోరం లక్ష్యం

- ఆర్టీఐ సామాన్యుల చేతిలో శక్తివంతమైన వజ్రాయుధం
- మండల ప్రధాన కార్యదర్శి బండి రాజు



**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:** ప్రజలకు సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించడమే ఆర్టీఐ ఫోరం లక్ష్యమని పెద్దమందడి మండలం ప్రధాన కార్యదర్శి బండి రాజు అన్నారు. ఆర్టీఐ సామాన్యుల చేతిలో ఒక శక్తివంతమైన వజ్రాయుధం లాంటిదన్నారు . శుక్రవారం ఆర్టీఐ ఫోరం పెద్దమందడి మండల ప్రధాన కార్యదర్శిగా బండి రాజు నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షులు రవికుమార్, రాష్ట్ర అధ్యక్షులు బత్తుల గణేష్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు.ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన బండి రాజు మాట్లాడుతూ... సామాన్యుడి చేతిలో వజ్రాయుధమైన సమాచార హక్కు చట్టంపై యువత అవగాహన పెంచుకోవాలని తెలిపారు. ప్రభుత్వ అధికారులను సమన్వయం చేసుకుంటూ జిల్లాలో సమాచార హక్కు చట్టం పకడ్బందీగా అమలుకు కృషి చేస్తానని,ఆర్టీఐ పై అవగాహన కార్యక్రమాలు చేపడతానని,సంఘం బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు.సహ చట్టం విషయంలో ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు.సహ చట్టం ద్వారానే ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకత,జవాబుదారితనం సాధ్యమన్నారు.తన పైన ఉన్న నమ్మకంతో తనకు బాధ్యతను అప్పగించిన రాష్ట్ర అధ్యక్షులు మరియు జిల్లా కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు. యువత విధిగా ఈ చట్టంపై అవగాహన పెంచుకుని గ్రామీణులను చైతన్యం చేయాలని కోరారు.


## జంతు జనన నియంత్రణ కేంద్రం ప్రారంభం

- వీధికుక్కల నియంత్రణకు కీలక అడుగు
- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**షాద్ నగర్,తెలంగాణ ముచ్చట్లు:** షాద్‌నగర్ పట్టణంలో వీధికుక్కల నియంత్రణకు కీలకంగా మారబోయే జంతు జనన నియంత్రణ కేంద్రాన్ని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. సి.ఎస్.కె. విల్లాస్ వెనుక ఉన్న మున్సిపల్ డంపింగ్ యార్డ్ వద్ద రూ.30 లక్షల వ్యయంతో ఈ కేంద్రం నిర్మించబడింది. ఈ కేంద్రం ద్వారా వీధికుక్కల జననాన్ని నియంత్రించి వాటి సంఖ్యను క్రమంగా తగ్గించనున్నారు. దీనితోపాటు ప్రజలకు కలుగుతున్న భయాలు, ఇబ్బందులు తగ్గే అవకాశం ఉంది. జనన నియంత్రణ శస్త్రచికిత్సలు వీధికుక్కలతో పాటు పెంపుడు కుక్కలు, ఇతర జంతువులకు కూడా అందించనున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సునీత, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, నాయకులు అగ్గనూర్ బస్వం, రఘు, తిరుపతి రెడ్డి, కృష్ణ రెడ్డి, జ్యమద్ ఖాన్, ఇబ్రహీం, ప్రవీణ్, తుపాకుల శేఖర్, సీతారాం, మాధు, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

# చివరి గింజ వరకు మద్దతు ధర పై ధాన్యం కొనుగోలు..




- రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రివర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి.
- ధాన్యం కొనుగోలు, రేషన్ కార్డుల జారీపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన మంత్రి

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**

యాసంగి సీజన్ లో తెలంగాణ రైతులు పండించిన వరి ధాన్యం చివరి గింజ వరకు మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేయడం జరుగుతుందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రివర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.

శుక్రవారం హైదరాబాద్ నుంచి మంత్రి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే. రామకృష్ణారావు, పౌర సరఫరాల శాఖ కమీషనర్ డి.ఎస్. చౌహాన్ లతో కలిసి ధాన్యం కొనుగోలుపై జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి తో కలిసి, కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుండి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి గింజ మద్దతు ధరపై కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, మన దగ్గర రికార్డ్ స్థాయిలో 57 లక్షల ఎకరాలలో వరి పంట సాగు జరిగిందని, ప్రభుత్వం దాదాపు 70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తుందని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేసిన 48 గంటల్లో రైతులకు ఖాతాలో డబ్బు జమ అవుతుందని అన్నారు. భారీ స్థాయిలో కొనుగోలు జరుగుతున్నప్పటికీ మీడియాలో సరిగ్గా కవర్ కావడం లేదని అన్నారు. పత్రికలలో వచ్చే నెగటివ్ వార్తలపై స్పందించాలని, సమస్యలు ఏవైనా ఉంటే పరిష్కరించాలని అన్నారు.

రాబోయే 15 రోజులలో కొనుగోలు కేంద్రాలకు ధాన్యం రానున్న నేపథ్యంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల వద్ద హమాలీలు, రవాణా వాహనాల కొరత రాకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని మంత్రి కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు.

కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన గన్నీ బ్యాగ్ లు, టార్పాలిన్ కవర్లు అందుబాటు లో పెట్టాలని అన్నారు. రైస్ మిల్లర్లతో కలెక్టర్, ఉన్నతాధికారులు చర్చించాలని, జిల్లాలలో అవసరమైతే ఇంటర్మీడియట్ గోదాములకు కొనుగోలు చేసిన ధాన్యాన్ని తరలించాలని అన్నారు. అకాల వర్షాలు కారణంగా రైతులు నష్టపోకుండా నాణ్యమైన ధాన్యాన్ని వేగవంతంగా కొనుగోలు చేయాలని మంత్రి సూచించారు.

2025, జనవరి 26 తర్వాత మన రాష్ట్రంలో నూతనంగా 1,57,467 రేషన్ కార్డులను పంపిణీ చేశామని, మీసేవ కేంద్రాలు, ప్రజాపాలన కేంద్రాల ద్వారా వచ్చిన దరఖాస్తుల విచారణ పూర్తి చేయాలని మంత్రి తెలిపారు.

వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ధాన్యం పెండింగ్ లో ఉన్నదని, కొనుగోలు సజావుగా పూర్తి చేయాలని, మిల్లర్ల వద్ద తరుగు తీయకుండా చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. రవాణా కాంట్రాక్టర్ లతో చర్చించి నిర్దేశించిన మేర వాహనాలు కొనుగోలు కేంద్రాల వద్ద అందుబాటులో ఉంచాలని అన్నారు.

వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న రాష్ట్ర రవాణా శాఖ మంత్రి వర్యులు పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, ధాన్యం కొనుగోలు అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, రైస్ మిల్లుల వద్ద తరుగు లేకుండా చూడాలని అన్నారు. గన్ని బ్యాగులు సమస్య రాకుండా చూసుకోవాలని, రవాణా సమస్యలు ఏవైనా ఉంటే సంబంధిత రవాణా శాఖ అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లాలని మంత్రి తెలిపారు.

వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామ కృష్ణా రావు మాట్లాడుతూ ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేసి ధాన్యం కొనుగోలు ప్రక్రియ చేపట్టిందని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం కలెక్టర్లు ప్రణాళిక బద్ధంగా యాసంగి పంట కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలని సీఎస్ తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను రెగ్యులర్ గా కలెక్టర్లు తనిఖీ చేయాలని, క్షేత్ర స్థాయిలో ఎదురయ్యే చిన్న, చిన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అన్నారు.

ప్రతి రోజు జరుగుతున్న కొనుగోలు ప్రక్రియ పురోగతి పై మీడియాకు సమాచారం అందించాలని అన్నారు. జిల్లాలో ఎక్కడైనా కొనుగోలు ప్రక్రియలో ఇబ్బందులు వస్తే వెంటనే పరిష్కరించి ఆ సమాచారం కూడా రైతులకు మీడియా ద్వారా తెలియ జేయాలని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న పౌర సరఫరాల శాఖ కమీషనర్ డిఎస్ చౌహన్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా 7 లక్షల 70 వేల 477 మంది రైతుల నుంచి 49.53 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి 8 వేల 42 కోట్లు మద్దతు ధర క్రింద చెల్లించామని అన్నారు. గతం కంటే అధికంగా ఈ యాసంగి సీజన్ లో మనం ధాన్యం కొనుగోలు చేశామని అన్నారు. మే 15 నాటికి 202223 రబీ సీజన్ లో 25.35 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం, 202324 రబీ సీజన్ లో 32.93 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తే, 202425 రబీలో 49.53 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని అన్నారు. ప్రతి రోజు అదనపు కలెక్టర్లతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహిస్తూ ధాన్యం కొనుగోలు ప్రక్రియను పర్యవేక్షిస్తున్నామని అన్నారు. మే నెలాఖరు నాటికి పకడ్బందీగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలని అన్నారు. వార్తా పత్రికలు, సామాజిక మాధ్యమాల్లో వచ్చే అసత్య ప్రచారాలను తిప్పికొట్టాలని అన్నారు. ధాన్యం రవాణాకు వాహనాల ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని, కలెక్టర్, ఆర్.టి.ఓ , పోలీస్ అధికారులు సమన్వయంతో ఖాళీగా ఉన్న లారీలను పూర్తి స్థాయిలో ధాన్యం కొనుగోలుకు కేటాయించాలని అన్నారు. రైస్ మిల్లుల వద్ద ధాన్యం బస్తాల అన్ లోడింగ్ ఆలస్యం కాకుండా చూడాలని, హమాలీల కొరత ఉండకుండా జాగ్రత్త పడాలని అన్నారు.



ధాన్యం కొనుగోలు అంశంపై జిల్లా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించి ప్రత్యేకంగా మానిటర్ చేయాలని అన్నారు. రైస్ మిల్లర్లు తాలు, తరుగు పేరు మీద ఎటువంటి కోతలు లేకుండా జాగ్రత్తలు పాటించాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద గన్ని బ్యాగులు ఉండాలని రైతులకు నేరుగా ఇవ్వవద్దని, మనం కొనుగోలు చేసిన ధాన్యంనింపేందుకు మాత్రమే వినియోగించాలని అన్నారు. గత ఆరు నెలల కాలంలో రేషన్ తీసుకోక పోవడం, ఇతర రాష్ట్రాలకు చెందిన డూప్లికేట్ బెనిఫిషరీ, చనిపోయిన వారి పేర్లు ఉండటం వంటి వివిధ కారణాల వల్ల భారత ప్రభుత్వం నుంచి వచ్చిన సమాచారం ప్రకారం 96 వేల 240 రేషన్ కార్డుల పరిధిలోని లక్షా 62 వేల 777 మంది లబ్ధిదారులు అనుమానాస్పదంగా ఉన్నారని, జిల్లాల వారీగా సంబంధిత జాబితా అందించామని, వీటిపై విచారణ చేసి వివరాలు సమర్పించాలని కలెక్టర్ లకు సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్ ఉన్న ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి చందన్ కుమార్, జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ శ్రీలత, జిల్లా సహకార అధికారి గంగాధర్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సన్యాసయ్య, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పుల్లయ్య, జిల్లా మార్కెటింగ్ అధికారి ఎం.ఏ. అలీమ్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులలో దరఖాస్తుల స్వీకరణ...

- తహశీల్దార్ పున్నంచందర్.
- బోనకల్ మండలం గోవిందాపురం(ఏ) గ్రామంలో రెవెన్యూ సదస్సులను నిర్వహించిన తహశీల్దార్.



**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:** భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని అమల్లోకి తెచ్చిందని, గ్రామాల్లో చేపడుతున్న రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యల పరిష్కారానికి దరఖాస్తులు స్వీకరించినట్లు తహశీల్దార్ ఏ. పున్నంచందర్ అన్నారు. మంగళవారం బోనకల్ మండలం గోవిందాపురం(ఏ) గ్రామంలో తహసీల్దార్ రెవెన్యూ సదస్సు నిర్వహించి, భూ సమస్యలకు సంబంధించి రైతుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ, రైతులకు తమ భూముల విషయంలో ఉన్న అభద్రత భావాన్ని తావు నీయకుండా జవాబుదారుతనాన్ని పెంచేందుకు భూ భారతి చట్టాన్ని చేపట్టడం జరిగిందని అన్నారు. కొత్త చట్టం ద్వారా లావాదేవీల సేవలు, రిజిస్ట్రేషన్, ముటేషన్, నిషేధిత భూములు, ఆర్ఓఆర్ మార్పులు చేర్పులు వంటి సేవలు సులభతరం అవుతాయని తెలిపారు. రైతులకు, అధికారులకు సులభంగా అర్థం అయ్యేలా సామాన్య, గ్రామీణ ప్రజల, రైతుల సమస్యలు పరిష్కారం అయ్యేలా భూ భారతి చట్టం ఉందన్నారు. హక్కుల రికార్డులలో తప్పుల సవరణకు భూ భారతి లో అవకాశం ఉందన్నారు. పెండింగ్ సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారం లభిస్తుందన్నారు. భూమి హక్కులు ఏ విధంగా సంక్రమించిన మ్యుటేషన్ చేసి రికార్డులలో నమోదు చేయవచ్చన్నారు. భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి చట్టంలో రెండు అంచెల అప్పీల్ వ్యవస్థ ఉందని తెలిపారు. భూదార్ కార్డుల జారీ జరుగుతుందన్నారు. రైతులకు ఉచిత న్యాయ సహాయం లభిస్తుందని తెలిపారు. గ్రామ రెవెన్యూ రికార్డుల నిర్వహణ ఉంటుందని, మోసపూరితంగా హక్కుల రికార్డులు మార్చి, ఎవరైనా ప్రభుత్వ, భూదాన్, అసైన్డ్, ఎండోమెంట్, వక్ఫ్ భూములకు పట్టాలు పొందితే రద్దుచేసే అధికారం చట్టంలో ఉందన్నారు. హక్కుల రికార్డుల్లో తప్పుల సవరణకు, భూమి హక్కులు ఉంది రికార్డులో లేనివారు హక్కుల రికార్డులో నమోదు చేయించుకోవడానికి కొత్త చట్టం వచ్చిన సంవత్సరం లోగా దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా గోవిందాపురం(ఏ) గ్రామంలో చేపట్టిన రెవెన్యూ సదస్సులో భూ సమస్యలకు సంబంధించి 52 దరఖాస్తులను అధికారులు స్వీకరించి, రశీదులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ శర్మ, బోనకల్ మండల ఆర్ఐ మైథిలి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## నూతన వధూవరులను ఆశీర్వదించిన ఝాన్సిరెడ్డి

**పాలకుర్తి,తెలంగాణ ముచ్చట్లు:** పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ హనుమాండ్ల ఝాన్సిరెడ్డి నియోజకవర్గంలోని పలు మండలాల్లో నిర్వహించిన వివాహ మహోత్సవాల్లో పాల్గొన్నారు. వివాహ బంధంతో ఒక్కటైన నూతన వధూవరులను స్వయంగా ఆశీర్వదించి, వారి వైవాహిక జీవితం ఆనందంగా, సుఖశాంతులతో కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాల్లో పాలకుర్తి నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు. వివాహాల సందర్భాన్ని పండుగలా మార్చిన ఝాన్సిరెడ్డి హాజరైన ప్రతి మండలంలో ప్రజలతో సాన్నిహిత్యం పెంచుకున్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక





# రాజ్యాంగ పరిరక్షణ కాంగ్రెస్ తోనే సాధ్యం

- నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మహమ్మద్ జావేద్
- కార్యనిర్వాహక అధ్యక్షులు దీపక్ చౌదరి
- నగర కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:** రాజ్యాంగ పరిరక్షణ కాంగ్రెస్ తోనే సాధ్యమవుతుందని ఖమ్మం నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మహమ్మద్ జావేద్ అన్నారు. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవనంలో నగర కాంగ్రెస్ నేతలతో జై భీం జై బాపు జై సంవిధాన్ పై 2వ పట్టణ సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జై బాపు జై భీమ్ జై సంవీధాన్ ప్రోగ్రామ్ ను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయా డివిజన్ అధ్యక్ష,కార్యదర్శులకు సూచించారు.కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగంపై చేస్తున్న దాడిని ప్రజలకు వివరించాలన్నారు. బీజేపీ అధికారాన్ని అడ్డుపెట్టుకొని రాజ్యాంగ బద్ధ సంస్థలను ఎలా నిర్వీర్యం చేస్తుందో ప్రజలకు వివరించాలన్నారు. కరపత్రాల రూపంలో గోడపత్రిక రూపంలో జై భీం జై బాపు జై సంవిధాన్ ను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు దిద్దుకురి వెంకటేశ్వర్లు పైడిపల్లి రోహిణి సత్యనారాయణ రాపర్తి శరత్ 13 డివిజన్లో అధ్యక్షులు పోటీ చేసినటువంటి అభ్యర్థులు సీనియర్ కాంగ్రెస్ నాయకులు తోటకూరి శివయ్య సోషల్ మీడియా జిల్లా కోఆర్డినేటర్ బండి మాధవరం ఏలూరు రవికుమార్ జిల్లా కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు కుంటిముక్కల నాగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు





# ఎంపి కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కలిసిన యశస్విని రెడ్డి, ఝూన్సీ రెడ్డి

**హనుమకొండ, తెలంగాణ ముచ్చట్లు:** వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, స్టేషన్ ఘన్పూర్ శాసనసభ్యులు కడియం శ్రీహరిని శుక్రవారం హనుమకొండ కనకదుర్గ కాలనీలోని ఎంపీ క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమండ్ల ఝూన్సీ రెడ్డి, ఎమ్మెల్యే యశస్విని రెడ్డి కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా నేతల మధ్య స్నేహపూర్వక వాతావరణంలో చర్చలు సాగినట్టు సమాచారం. పరస్పర శుభాకాంక్షలు తెలిపారు. పార్లమెంట్ స్థాయిలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజాప్రయోజన కార్యక్రమాలపై కూడా ఈ సందర్భంగా పలువురు అభిప్రాయాలు పంచుకున్నారు.



# రాజిరెడ్డికి నివాళులర్పించిన బీసీ కమిషన్ మెంబర్ సురేందర్, జర్నలిస్టు గౌరీ శంకర్

**ఉప్పల్,తెలంగాణ ముచ్చట్లు:** ప్రముఖ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, కాప్రా మున్సిపల్ మాజీ చైర్మన్, ఉప్పల్ శాసనసభ నియోజకవర్గ తొలి ఎమ్మెల్యే, టిటిడి బోర్డు మాజీ సభ్యుడు, సంఘ సేవకుడు, నిగర్వి స్వభావం కలిగిన విలువల నేత బండారి రాజిరెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు తిరుమలగిరి సురేందర్, ప్రముఖ జర్నలిస్టు గౌరీ శంకర్ కలిసి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు రాజిరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రజాసేవను జీవిత లక్ష్యంగా చేసుకుని, రాజకీయాలకు విలువలు, నీతి, వినయం మేళవించిన రాజిరెడ్డి స్ఫూర్తిదాయక నాయకుడిగా గుర్తుండిపోతారని కొనియాడారు.



# రైతుల కోసం కొట్లాడిన పార్టీ బీజేపీ సౌడ రమేశ్,బీజేపీ జిల్లా అధ్యక్షులు

**జనగామ, తెలంగాణ ముచ్చట్లు:** దేవరుప్పుల మండల కేంద్రంలోని అక్షర గార్డెన్ లో బీజేపీ మండల అధ్యక్షుడు బస్వ భాస్కర్ అధ్యక్షతన నిర్వహించిన కార్యకర్తల సమావేశానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేశ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ భద్రత, హిందూ సంస్కృతి, రైతుల హక్కుల కోసం భారతీయ జనతా పార్టీ పోరాటం చేస్తుందని స్పష్టంచేశారు.

ష్కరే తొయిబా ఉగ్రవాదుల చేతుల్లో 26 మంది భారతీయులు ప్రాణాలు కోల్పోయిన 14 రోజుల్లోనే దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పదునైన జవాబు ఇచ్చారని పేర్కొన్నారు. లక్షా నలభై కోట్ల జనాభాలో 80 శాతం మంది హిందువుల మనోభావాలను గౌరవిస్తూ అయోధ్యలో శ్రీరామ మందిరం నిర్మించారన్నారు. తొలుత కొందరు నాయకులు గుడి నిర్మాణంపై అనుచిత వ్యాఖ్యలు చేసినా, చివరికి నిజం గెలిచిందని అన్నారు. రైతుల సంక్షేమం కోసం ఎప్పుడూ బీజేపీ ముందుంటుందని, చెన్నూరు రిజర్వాయర్ పూర్తి అయితే 20,500 ఎకరాలకు నీరు అందుతుందని చెప్పారు. పాలకుర్తి నియోజకవర్గ రైతులు నీటి కొరతతో బాధపడుతున్నా ఎమ్మెల్యే అసమర్థత వల్ల రిజర్వాయర్ పనులు నిలిచిపోయాయని ఆరోపించారు. కాంగ్రెస్‌కు తలపోటు బీజేపీ మాత్రమేనని, వందమంది కాంగ్రెస్ నేతలకు పది మంది బీజేపీ నాయకులు సమానమని వ్యాఖ్యానించారు. పార్టీ అభివృద్ధికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని, ఈ నెల 19న జనగామ జిల్లా కేంద్రంలో నిర్వహించే తిరంగా యాత్రలో వేలాది మంది పాల్గొని బీజేపీ బలాన్ని చాటాలని పిలుపునిచ్చారు. పాలకుర్తి నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు రావాలని కోరారు.

ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు లేగ రాంమోహన్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఊడుగుల రమేశ్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్లయ్య, జిల్లా అధికార ప్రతినిధి చింత సృజన్, మాజీ మండల అధ్యక్షుడు భాగాల నవీన్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యుడు నరసింహ చారి సహా జిల్లా, మండల, గ్రామ స్థాయి నేతలు పాల్గొన్నారు.



# పలు కుటుంబాలను పరామర్శించిన మాజీ మంత్రి పువ్వాడ..

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:** శుక్రవారం మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఖమ్మం నందు పలు కార్యక్రమాలకు హాజరయ్యారు. ఖమ్మం రూరల్ వెంకటగిరి వాస్తవ్యులు మొర్రిమేకల రామసంగం కుమారుడు మోహన్ కృష్ణ వెడ్స్ గౌతమి వివాహానికి హాజరై వధువరులను ఆశీర్వదించారు. 8వ డివిజన్ గోపాలపురం బిఆర్ఎస్ నాయకులు లాల్ సాహెబ్ మరియు కొర్ర లోకేష్ ఇటీవల మరణించగా వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. 27వ డివిజన్ శ్రీనివాస్ నగర్ చింతల ప్రసాద్ ఇటీవల మరణించగా వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

శ్రీనివాస్ నగర్ చిత్తలూరి నర్సయ్య ఇటీవల శస్త్ర చికిత్స చేయిచుకొనగా వారి ఇంటికి వెళ్ళి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. 29వ డివిజన్ బిఆర్ఎస్ నాయకుడు ఎర్రా అప్పారావు భార్య కృష్ణవేణి ఇటీవల శస్త్ర చికిత్స చేయిచుకొనగా వారి ఇంటికి వెళ్ళి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

ఖమ్మం కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ బత్తుల మురళి ఇటీవల అనారోగ్యంతో చికిత్స పొందుతున్నారు విషయం తెలుసుకొని వారి ఇంటికి వెళ్ళి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, మాజీ డిసిసిబి చైర్మన్ కూరాకుల నాగభూషణం,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆర్ జె సి కృష్ణ, మాజీ సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్,కార్పొరేటర్ కూరాకుల వలరాజు, మోతారపు శ్రావణి సుధాకర్,పసుమర్తి రామ్మోహన్,బిక్కసాని జస్వంత్,దనాల శ్రీకాంత్,డోన్వాన్ రవి,తోట వీరభద్రం, పాలడుగు పాపారావు,పత్తిపాక రమేష్,దడాల రఘు,దండగల రాం బాబు,సిరిపురపు సుదర్శన్,గొల్లపుడి రాంప్రసాద్, మిట్టపల్లి రవి, ఎస్టి ఎస్ టి సెల్ అధ్యక్షుడు సురేష్,ఖయుమ్,పిన్ని కోటేశ్వరరావు,అశోక్,వీరేందర్, మోహన్,తిరుపతి రావు,మల్లేశం, పణి,సాగర్ తదితరులు పాల్గొన్నారు.





# చల్లా కృష్ణ ఇంట ఉప్పలమ్మ వేడుక

**హాజరైన తుంబూరు దయాకర్ రెడ్డి**

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:** కాంగ్రెస్ పార్టీ 59వ డివిజన్ (దానవాయిగూడెం) సీనియర్ నాయకులు చల్లా కృష్ణ ఇంట్లో ఉప్పలమ్మ వేడుక శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్ చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి హజరయ్యారు. అమ్మవారి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. చల్లా కృష్ణ కుటుంబ సభ్యులకు అభినందనలు తెలిపారు. అనంతరం వారి ఆతిథ్యాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



# గన్‌మెన్ భౌతిక దేహానికి నివాళులు అర్పించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి

**జనగామ, తెలంగాణ ముచ్చట్లు:** స్టేషన్ ఘన్పూర్ పరిసర ప్రాంతంలో గురువారం జరిగిన రోడ్ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన గన్‌మెన్ సతీష్ మరణవార్త తెలుసుకున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు శుక్రవారం జనగామ జిల్లా కేంద్రంలోని ఏరియా హాస్పిటల్‌కి చేరుకున్నారు. అక్కడ సతీష్ భౌతిక దేహానికి పూలమాల వేశి, నివాళులు అర్పించారు.

తరువాత ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి మానసికంగా ధైర్యం చెబుతూ, తమ కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ విషాద సమయంలో కుటుంబానికి అండగా ఉండటమే తన బాధ్యతగా భావిస్తున్నట్టు తెలిపారు.

ఈ సందర్భంగా జిల్లా యువజన నాయకుడు వంగ అర్జున్, పాలకుర్తి నియోజకవర్గ యువజన అధ్యక్షుడు గడ్డం రాజు, దేవరుప్పుల మండల యూత్ అధ్యక్షుడు నవీన్ నాయక్ తదితరులు ఎర్రబెల్లి దయాకర్ రావుతో పాటు ఉన్నారు.



# బాధితులకు అండగా సీఎం సహాయ నిధి పథకం

**ధర్మసాగర్, తెలంగాణ ముచ్చట్లు:** అనారోగ్యంతో బాధపడుతున్న ప్రజలకు ఆర్థికంగా అండగా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం సీఎం సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) పథకాన్ని కొనసాగిస్తోంది. ఈ పథకం ద్వారా ధర్మసాగర్ మండలం నారాయణగిరి గ్రామానికి చెందిన ఈర్ల పూజితకు రూ.28,000 మంజూరైంది.

ఇటీవల ఆమె తీవ్ర అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన వల్లపురెడ్డి రాం రెడ్డి, ఈ విషయాన్ని ఎమ్మెల్యే కడియం శ్రీహరి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే కడియం సూచనతో సీఎం సహాయ నిధి నుండి అవసరమైన సహాయం మంజూరు అయింది. శుక్రవారం లబ్ధిదారులకు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఈర్ల పూజిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే కడియం శ్రీహరికి కృతజ్ఞతలు తెలిపారు.

చెక్కు పంపిణీ కార్యక్రమంలో మాజీ సర్పంచ్, మాజీ ఎంపిటిసి వల్లపురెడ్డి రమాదేవి, పిఎసిఎస్ డైరెక్టర్ మడికంటి రాజయ్య, మాజీ ఉపసర్పంచ్ పుట్ట కుమార్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు బాషబోయిన రాజు, గంటే కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ షాక్ తో వ్యక్తి మృతి

**సత్తుపల్లి, ఆర్ సి, తెలంగాణ ముచ్చట్లు:** వేంసూరు మండలం, లింగపాలెం గ్రామంలో శుక్రవారం విద్యుత్ షాక్ తో మృతి చెందినట్లు ఘటన వెలుగులోకి వచ్చింది. స్థానికులు చెప్పిన వివరాలు ప్రకారం, లింగపాలెం గ్రామానికి చెందిన రాంపల్లి ఈశ్వరచారి (40 సం.) ఉ.8.15 గం.ల సమయంలో ఇంటి ముందు ఉన్న తన వర్క్ షాప్ దగ్గరికి వెళ్లి పట్టా తీశాడు. ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ కు గురి కావడంతో, కుటుంబ సభ్యులు హుటహుటిగా సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా, డాక్టరు పరిశీలించి మృతి చెందినట్లు నిర్ధారించారు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



# వర్సిటీలనూ వదలని ట్రంప్



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పాలనాపరమైన అంశాలపై దృష్టి పెట్టడం కన్నా తన మాట వినని వారిని ఎలా లొంగదీసుకోవాలనే దానిపైనే ఎక్కువ దృష్టి పెడుతున్నట్లు కనిపిస్తోంది. ట్రేడ్ వార్ పేరుతో కెనడా, చైనా వంటి దేశాలను లొంగదీసుకోవడానికి ప్రయత్నించిన ట్రంప్ చివరికి తన మాట వినని విద్యాసంస్థలను కూడా వదలి పెట్టడంలేదు. ప్రపంచ ప్రఖ్యాతి చెందిన యూనివర్శిటీల్లో ఒకటైన హార్వర్డ్ విశ్వవిద్యాలయంపై ఆయన ప్రకటించిన యుద్ధమే దీనికి ఉదాహరణ. హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో జరిగే నియామక పద్ధతుల ప్రవేశ విధానల్లో మార్పులు చేయాలని, ఫేస్‌మాస్క్‌లను నిషేధించాలని ట్రంప్ సర్కార్ గతంలో నిబంధనలు జారీ చేసింది. దీనిపై స్పందించిన హార్వర్డ్ వర్శిటీ ప్రెసిడెంట్ అలాన్ గార్బర్ ఆ డిమాండ్లను వ్యతిరేకిస్తున్నట్లు ప్రకటించారు. ఏ ప్రభుత్వమైనా విశ్వవిద్యాలయాల్లో ఏమి బోధించాలి, ఎవరిని చేర్చుకోవాలి, నియమించుకోవాలి లేదా ఏరంగాలను ఎంచుకోవాలో నిర్దేశించకూడదని స్పష్టం చేశారు. హార్వర్డ్ ధిక్కారాన్ని తీవ్రంగా పరిగణించిన ట్రంప్ సర్కార్ విశ్వవిద్యాలయానికి అందించే 2.2 బిలియన్ డాలర్ల గ్రాంట్లను గత వారం స్తంభింపజేసింది. అంతేకాకుండా వర్శిటీకి సంబంధించిన 60 మిలియన్ డాలర్ల ఫెడరల్ కాంట్రాక్ట్‌లను నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. అంతేకాకుండా వైద్య పరిశోధనల కోసం వర్శిటీకి ఇచ్చే ఫెడరల్ గ్రాంట్లు, కాంట్రాక్టులను మరో బిలియన్ డాలర్ల మేర తగ్గించాలని కూడా ట్రంప్ యంత్రాంగం యోచిస్తున్నట్లు మీడియా కథనాలు పేర్కొన్నాయి. దీనితో హార్వర్డ్ వర్శిటీ అనూహ్యంగా న్యాయస్థానాన్ని ఆశ్రయించింది.నిధులను నిలిపివేయడం ద్వారా సంస్థ విద్యాపరమైన నిర్ణయాలపై నియంత్రణ సాధించడానికి ట్రంప్ సర్కార్ యత్నిస్తోందని మసాచుసెట్స్‌లోని ఫెడరల్ కోర్టులో దావా వేసింది. అంతేకాకుండా ఇతర విశ్వవిద్యాలయాలను కూడా లక్ష్యంగా చేసుకొంటోందని కేసులో ప్రస్తావించింది. వాస్తవానికి ట్రంప్ సర్కార్ దేశంలోని పలు విశ్వవిద్యాలయాలపైనా ఏదో ఒక కారణంపై చర్యలు తీసుకుంటూనే ఉంది. పౌర హక్కులను ఉల్లంఘించారన్న కారణంపై ఇప్పటికే కొలంబియా, పెన్సిల్వేనియా సహా కార్నెల్, నార్త్ వెస్ట్రన్ విశ్వవిద్యాలయాలకు అందించే నిధులను నిలిపివేసింది. నిబంధనలను అమలు చేయకపోతే కఠిన చర్యలు తీసుకుంటామంటూ మరో 60 విశ్వవిద్యాలయాలకు గత నెల విద్యా శాఖ లేఖలు రాసింది కూడా. తాజాగా జాతి వివక్ష ఘటనలు జరుగుతున్నాయన్న కారణంపై హార్వర్డ్‌కు ఇచ్చే గ్రాంట్లులో మరో 450 మిలియన్ డాలర్ల కోత విధిస్తున్నట్లు కూడా ట్రంప్ సర్కార్ ప్రకటించింది. ఇంతకీ హార్వర్డ్ వర్శిటీపై ట్రంప్‌కు ఎందుకింత ఆగ్రహం? 2023 అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై హమాస్ దాడి నేపథ్యం ఇందుకు కారణమని చెప్పాలి. ఈ దాడి తర్వాత ఇజ్రాయెల్ పాలస్తీనాపై దాడులు తీవ్రం చేయడం గాజా ప్రాంతంలో వందలాది మంది పాలస్తీనియన్లు మృతి చేయడం తెలిసిందే. ఈ నేపథ్యంలో అమెరికాలోని పలు విశ్వవిద్యాలయాల్లో ఇజ్రాయెల్ వ్యతిరేక ఆందోళనలు చెలరేగాయి. హార్వర్డ విశ్వవిద్యాలయంలోని సంస్థ ప్రధాన పోషకుడు జాన్ హార్వర్డ్ విగ్రహంపై కొందరు పాలస్తీనా అనుకూల విద్యార్థులు పాలస్తీనా జెండా ఎగరేశారు. వాస్తవానికి ఆ విగ్రహంపై అమెరికా జెండా ఉంటుంది.లేదంటే విదేశీ ప్రముఖులు వచ్చినప్పుడు వారి దేశ జెండాలను ఉంచుతారు. ఇదంతా జో బైడెన్ హయాంలో జరిగినప్పటికీ అ తర్వాత అధికార పగ్గాలు చేపట్టిన ట్రంప్ మాత్రం ఈ ఘటనలను మర్చిపోలేదు. స్వతంత్ర వ్యవస్థలుగా వ్యవహరిస్తున్న యూనివర్శిటీలను కట్టడిచేయాలని తీర్మానించుకొన్నారు. అమెరికాలోని విశ్వవిద్యాలయాల్లో నియామకాలకు సంబంధించిన నిబంధనల్లో మార్పులు చేయాలంటూ ట్రంప్ సర్కార్ పట్టుబడుతోంది. అయితే ఇందులో యూనివర్శిటీలు మాత్రం ససేమిరా అంటున్నాయి. న్యాయ పోరాటానికి సిద్ధమవుతున్నాయి. హార్వర్డ్ విశ్వవిద్యాలయంపై ట్రంప్ సర్కార్ ప్రకటించిన యుద్ధం ప్రపంచ ప్రఖ్యాత వర్శిటీల్లో ఒకటైన దానిలో చదువుతున్న వేలాది మంది విద్యార్థులు వందలాది మంది అధ్యాపకులపై ప్రభావం చూపించనుంది. 1636లో స్థాపించిన ఈ విశ్వవిద్యాలయంలో సుమారు 6,800 మంది అండర్ గ్రాడ్యుయేట్లు, 14 వేల మంది పోస్టు గ్రాడ్యుయేట్ విద్యార్థులు అంటే దాదాపు 20 వేల మంది ప్రపంచం నలుమూలల నుంచి వచ్చి విద్యనభ్యసిస్తుంటారు. ఇన్ని వందల సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ విద్యా సంస్థకు ఘనమైన చరిత్ర ఉంది. వర్శిటీ పూర్వ విద్యార్థుల్లో 8 మంది అమెరికా అధ్యక్షులు, 30 మందికిపైగా విదేశీ దేశాధినేతలు, నోబెల్ లాంటి అంతర్జాతీయ అవార్డులు అందుకున్న పలువురు ఉన్నారు. అంతేకాకుండా వివిధ రంగాల్లో నిష్ణాతులైన అనేక మంది ఈ వర్శిటీలో ప్రత్యేక ఆహ్వానితులుగా ప్రసంగాలు చేశారు. ఈ విధంగా అన్ని దేశాలకు చెందినవారికి ఈ వర్శిటీతో అనుబంధం ఉంది. ఇన్ని వందల సంవత్సరాలు ఓ వెలుగు వెలిగిన విశ్వవిద్యాలయం ఇప్పటి ట్రంప్ సర్కార్ నిర్ణయంలో వివాదాల్లో చిక్కుకోవడం విచారకరం. ఇది విద్యా రంగానికి చెందిన నిపుణులందరికీ బాధాకరమే. విద్యా సంస్థలకు రాజకీయాల మురికి అంటడం ఎంతమాత్రం మంచిదికాదు. న్యాయస్థానాల జోక్యంతోనైనా ట్రంప్ కళ్లు తెరుస్తారేమో చూడాలి.





# తుర్కియేకు చెందిన సెలెబీ షేర్లకు భారీ దెబ్బ

(ఢిల్లీ, తెలంగాణ ముచ్చట్లు)

తుర్కియేకు చెందిన సెలెబీకి భారత్ కొట్టిన దెబ్బ కాస్త గట్టిగానే తాకినట్లుంది. మే 16న ఇస్తాంబుల్‌లో ఆ కంపెనీ షేరు ధర ఏకంగా 10శాతం పతనమైంది. గత నాలుగు సెషన్లలో ఈ షేరు విలువ 30శాతం ఆవిరైంది. సెలెబీ సబ్సిడరీ కంపెనీ ద్వారా భారతీయ విమానాశ్రయాలలో సరకుల రవాణాతోపాటు బహుళ సేవలను ఇన్నాళ్లూ అందించింది. కానీ, ఆపరేషన్ సిందూర్ సమయంలో తుర్కియే ప్రభుత్వం పాకిస్థాన్‌కు మద్దతు ఇవ్వడంతో పాటు తమ సైనికులను అక్కడకు పంపింది. దీంతో ఆగ్రహించిన భారత ప్రభుత్వం సెలెబీకి ఉన్న సెక్యూరిటీ క్లియరెన్స్‌లను రద్దు చేసింది. మరోవైపు అదానీ ఎయిర్ పోర్టు సంస్థ కూడా సెలెబీతో ఉన్న ఒప్పందాన్ని రద్దు చేసుకొంది. దీంతో ముంబయి, అహ్మదాబాద్ ఎయిర్‌పోర్టుల నుంచి అది బయటకు వెళ్లినట్లైంది. ఈ విషయాన్ని రెండు ఎయిర్ పోర్టులకు చెందిన ప్రతినిధి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం అదానీ ఎయిర్ పోర్ట్స్ హోల్డింగ్‌కు ముంబయి, అహ్మదాబాద్, మంగళూరు, గువహాటి, జైపూర్, లఖ్‌నవూ, తిరువనంతపురం విమానాశ్రయాలను నిర్వహిస్తోంది. ప్రభుత్వ నిర్ణయం తర్వాత దిల్లీ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు లిమిటెడ్ కూడా తన ఒప్పందాన్ని రద్దు చేసుకొంది. ఆ స్థానంలో ఏఐఎస్‌ఏటీఎస్, బర్డ్‌గ్రూప్‌తో కలిసి పనిచేయనున్నట్లు తెలిపింది. ఇక తమది తుర్కియే కంపెనీయే కాదని తాజాగా సెలెబీ వివరణ ఇచ్చింది. ఆ దేశాధ్యక్షుడు ఎర్డోగాన్ కుటుంబంతో తమకు సంబంధం లేదని, ఆయన కుమార్తె తమకు బాస్ కాదని వివరణ ఇచ్చింది. "తుర్కియే అధ్యక్షుడు ఎర్డోగాన్ కుమార్తె సుమెయ్యి మా కంపెనీని నియంత్రిస్తున్నారంటూ జరుగుతున్న ప్రచారంలో నిజం లేదు. మా మాతృసంస్థలో ఆ పేరుతో ఎవరికీ హక్కులు గానీ, వాటాలు గానీ లేవు. అసలు మాది తుర్కియే సంస్థే కాదు. మా కంపెనీ యాజమాన్య హక్కులన్నీ సెలెబీ యోగ్లు కుటుంబానికే పరిమితం. వారికి ఎలాంటి రాజకీయ సంబంధాలు లేవు " అని కంపెనీ తమ ప్రకటనలో వెల్లడించింది.

## స్విగ్గీ, జొమాటో నుండి షాకింగ్ నిర్ణయం

# ఇకపై 'గోల్డ్', 'వన్' మెంబర్లకు సైతం అదనపు డెలివరీ ఛార్జీలు!




(ఢిల్లీ, తెలంగాణ ముచ్చట్లు)

ప్రముఖ ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ సంస్థలై స్విగ్గీ, జొమాటోలు తమ వినియోగదారులకు షాకింగ్ న్యూస్ చెప్పాయి. ఇప్పటివరకు తమ కస్టమర్లకు స్పెషల్ లాయల్టీ ప్రోగ్రాం కింద అందిస్తున్న సర్ ఛార్జ్ సౌకర్యాన్ని నిలిపివేశాయి. ఇకపై జొమాటో గోల్డ్, స్విగ్గీ వన్ మెంబర్ షిప్ కలిగిన యూజర్లు సైతం వర్షం సమయంలో లేదా ఇతర ప్రత్యేక పరిస్థితులలో ఫుడ్ ఆర్డర్ చేస్తే అదనపు డెలివరీ ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. స్విగ్గీ, జొమాటో కంపెనీలు గతంలో లాయల్టీ ప్రోగ్రాం కింద ఉన్న కస్టమర్లకు ఎలాంటి అదనపు ఛార్జీలు లేకుండా ఫుడ్ డెలివరీని అందించాయి. అయితే, ఈ సంస్థలు తమ నష్టాలను తగ్గించుకునేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికంలో జొమాటో కేవలం రూ.39 కోట్ల లాభాన్ని మాత్రమే ప్రకటించింది. ఇది అంతకు ముందు ఏడాది ఇదే కాలంతో పోల్చితే 78 శాతం తక్కువగా ఉంది. అలాగే, స్విగ్గీ సైతం భారీగా నష్టాలను చవిచూసినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే ప్రస్తుతం రెండు సంస్థలు తమ ఆదాయాలను పెంచుకుని నష్టాల నుంచి బయటపడేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఈ క్రమంలోనే ప్రతి ఆర్డరుపై ఎక్కువ ఛార్జీలను వసూలు చేస్తున్నట్లు నిపుణులు భావిస్తున్నారు.


# అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాల్లో అన్యాయం




తెలంగాణలోని విశ్వవిద్యాలయాల్లో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ పద్ధతిలో అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపడం అభినందించ దగ్గ విషయం. గత దశాబ్ది తెలంగాణలో విద్యావ్యవస్థ అభివృద్ధికి అనేక పరిమి తులు ఏర్పడ్డాయి. ప్రాథ మిక విద్య మొదలు ఉన్నత విద్య వరకు గత ప్రభుత్వం సరైన దృష్టి సారించలేదన్న విషయాన్ని గత ప్రభుత్వాన్ని గద్దె దించి తెలంగాణ సమాజం అర్థం చేయించింది. ఏ సమాజంలోనైనా విద్య మొదటి ప్రాధాన్యత అవ్వాలి. కానీ, మన రాష్ట్రంలో ఆ పరిస్థితి లేదు. కర్ణుని చావుకి సవాలక్ష కారణాలంటూ దీనికి అనేక కారణాలు న్నాయి. కానీ, వర్తమాన సమాజం ఈ పరిస్థితి మారాలని కోరుకుం టున్నది. ప్రపంచీకరణ ప్రభావం, పెట్టుబడి ప్రవాహం వల్ల విద్య ప్రాథమిక హక్కుగా, నైతిక బాధ్యతగా గుర్తించ బడటం లేదు. కేవలం ఒక పారిశ్రామిక రంగంగా తయారైంది. తెలంగాణ రాజధానిగా, మిని ఇండియాగా పిలవబడుతున్న హైదరాబాద్‌లో ఉన్నత విద్య ముఖ్యంగా ప్రయివేటు రంగం చేతుల్లోకి వెళ్లిపోయింది. ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యపై దృష్టిని కేంద్రీకరించడం లేదు. గత మూడు దశాబ్దాలుగా నెలకొన్న రాజకీయ, ఆర్థిక కారణాల వల్ల దేశవ్యాప్తంగా ఒక అసమ సమాజం ఏర్పడిరది. దీనివల్ల పేద, మధ్య తరగతి వర్గాలకు నాణ్యమైన విద్య దూరమైంది, ఈ పరిస్థితి మారాలి. రాష్ట్రంలో ఉన్నత విద్యాశాఖ పరిధిలోని పన్నెండు విశ్వవిద్యాలయాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ల భర్తీకి తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి విధి, విధానాలను 4ఏప్రిల్ 2025 జీవో నెంబర్21 ద్వారా ఖరారు చేసింది. ఇది నియ మించిన ఉన్నత స్థాయి కమిటీ ఈ సిఫారసులను చేసినట్లు, వాటిని ఆమోదించినట్లు ప్రకటిం చింది. నిజానికి ఈ విశ్వ విద్యాలయాల్లో గత ఇరవైయేండ్లుగా పనిచేస్తున్న కాంట్రాక్ట్, పార్ట్ టైమ్ అధ్యాపకుల స్థానాన్ని నిర్ధారించకుండా రిక్రూట్‌మెంట్ ప్రస్తావన తీసుకురావడం ద్వారా గత నెలరోజులుగా వివిధ రూపాల్లో నిరసన వ్యక్తమ వుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇక జీవో 21ని క్షుణ్ణంగా పరిశీలిస్తే గనుక గతంలో ఉన్న నిబంధనల స్థానంలో మూడు దశల స్క్రూటినీ విధానాన్ని అనుసరిస్తూ విశ్వవిద్యాల యాలు ఖాళీలను భర్తీ చేయాలని ప్రతిపాదించింది. ఈ విధానాలను ప్రతీ విశ్వవిద్యాలయం తమ పాలకమండలిలో ప్రవేశపెట్టి, ఆమోదించుకోవాల్సి ఉంటు ందని ఉన్నత విద్యామండలి సూచించింది. జీవో నెం. 21 అనుబంధం 1లో ఎ,బి,సి అనే విభజనల్లో స్క్రూటినీ విధా నాలను సూచించింది. ఈ మూడు దశల్లో అభ్యర్థి విషయ పరి జ్ఞానం, సబ్జెక్ట్ ప్రెజెంటేషన్, రీసెర్చ్ ఆప్టిట్యూడ్, వ్యక్తిత్వాల ఆధా రంగా మార్కులు కేటాయిస్తుంది. ఇది మా ర్కుల విభజన, స్క్రూటినీ విధానం. ఇది సహజ న్యాయానికి, యూజీసి నిబంధనలకు పూర్తి విరుద్ధం

ఉన్నత విద్యామండలి ప్రతిపాదించిన స్క్రూటినింగ్ విధా నాలను లోతుగా గమనిస్తే అనేక లోటు పాట్లు ఉన్నాయనే విషయం అర్థమవు తున్నది. అసిస్టెంట్ ప్రొఫెసర్ల భర్తీకి సంబం ధించి ఇప్పటివరకు రెండు దశల స్క్రూటినీ పద్ధతినే పాటిస్తున్నారు. మొదటి దశలో ఎపిఐ స్కోర్ వంద మార్కులు, ఇంటర్వ్యూ, ప్రజం టేషన్‌కి యాభై మార్కులను కేటాయి స్తారు. ఈ పద్ధతినే చాలా వరకు కేంద్రీయ విశ్వ విద్యాలయాలు అనుసరిస్తున్నాయి. కానీ, తెలంగాణ ఉన్నత విద్యామండలి ప్రతిపాదిత కమిటీ రూపొం దించిన ఈ జీవోలో ఈ పద్ధతిని మార్చారు. స్క్రూటినింగ్ విధానాన్ని మూడు దశలకు పెంచి, ఎ 50, బి 30, సి 20 అని మార్కులకు పరిమితం చేస్తూ, మిగతా వాటితో కలపకుండా వాటిని కట్టడి చేశారు. ఇది అనాలోచిత నిర్ణయం. ఇక ప్రతిపాదిత 'ఎ' దశలో పీహెచ్‌డీకి పది మార్కులు మాత్రమే కేటాయించారు. నిజానికి దేశవ్యాప్తంగా చాలా రాష్ట్రాలు, కేంద్రీయ విశ్వవిద్యాలయాలు అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాల్లో 25 నుండి 30 మార్కులను కేటాయిస్తున్నాయి. ఇక్కడ గమనించాల్సిన విషయమేమిటంటే అత్యున్నత డిగ్రీగా పేరు ఉన్న పీహెచ్‌డీ కన్నా, పీజీకి మార్కులు అధికంగా కేటాయించారు. ఇదెక్కడి విధానమో జీవో రూపకర్తలకే తెలియాలి.అలాగే బోధనాను భవానికి ఏడాదికి ఒక మార్కు చొప్పున గరిష్టంగా పది మార్కులిస్తున్నారు. అలాగేపోస్ట్ డాక్టోరల్, రీసెర్చ్ అసోసియేట్ షిప్‌లకి సంబంధించి ఐదు మార్కులు వేస్తున్నారు.ఇందులో అభ్యర్థి ముప్పై మార్కుల్లో సాధిం చిన మార్కుల ఆధారంగానే ప్రతి పాదిత సి దశలోకి 1:5 పద్ధతిలో ఎంపిక చేస్తామని ప్రకటించారు. దీనివల్ల నూత నంగా పీహెచ్‌డీ పూర్తి చేసుకున్న అభ్యర్థులు బోధన, పరిశోధా నుభవం విష యంలో తీవ్రంగా నష్ట పోతున్నారు. స్క్రూటినీ అనేది అభ్యర్థి మెరిట్ ఆధారంగా జర గాలి కానీ, ఇందులో అనుభవం పేరుతో స్క్రూటినీ జరుగుతుంది. ఇది సహజ న్యాయ సూత్రానికి వ్యతిరేకం. అలాగే ఎటువంటి వివక్షత చూపకుండా సమాన అవకాశాలు కల్పించే భారత రాజ్యాంగం ఆర్టికల్ 16కి ఈజీవో పూర్తి విరుద్ధం. ముప్పై మార్కుల్లో నూతనంగా పీహెచ్‌డీ పూర్తి చేసు కున్న అభ్యర్థి సహజంగానే పదిహేను మార్కులు కోల్పో తాడు. సగం మార్కులు కోల్పోయిన తర్వాత మిగతా పదిహేను మార్కులకు పోటీ పడి తర్వాతి దశలోకి ఎలా వెళ్లగలరు? ఇంత స్పష్టంగా సమస్య అర్థమవు తుంది. అభ్యర్థి మెరిట్‌ను ప్రతి పాదిత స్థానానికి సూచించిన అర్హతల్లో చూడాలి కానీ, అనుభవం ఏనాటికీ మెరిట్ కాజాలదు. ఈ అభ్యంతరం పట్ల ఈ జీవో రూపకర్తలు ప్రత్యేకంగా దృష్టి సారించాల్సిన అవ సరం ఉంది. అయినా విశ్వ విద్యాలయ స్థాయి అధ్యాపక స్థితికి మొదటి అడుగు (డోర్‌స్టెప్) అయిన అసిస్టెంట్ ప్రొఫెసర్ స్థానా నికి ఎక్స్‌పీరియన్స్‌ని ప్రధానం చేసి, ఈ మార్కుల తోనే స్క్రూటినీ చేస్తామని చెప్పడం అప్రజాస్వామికం.

'బి' దశలోకి వచ్చిన అభ్యర్థి మెరిట్‌ని పరిగణలోకి తీసుకోకుండా "బోధనానుభవం, పరిశోధానుభవం" పేరుతో మార్కులను కేటా యించి, ఇంటర్వ్యూ దశలోకి పంపుతున్నారు. దీనివల్ల బోధన, పరిశోధనలపై మక్కువతో ఉన్న నూతన అభ్యర్థులకు ఉన్నత విద్యామండలి ప్రతిపాదించిన విధి, విధానాలే అడ్డంకిగా మారు తున్నాయి. వీరు అసిస్టెంట్ ప్రొఫెసర్‌షిప్‌కి అనర్హులని నూటికి నూరు శాతం ప్రకటిస్తు న్నాయి. యూనివర్సిటీల్లో పనిచేస్తున్న పార్ట్ టైం అధ్యాపకుల బోధనానుభవాన్ని పరిగణలోకి తీసుకోవడం లేదు. విచిత్రమేమిటంటే యూనివర్సిటీ పరిధిలోని ప్రయివేటు కళాశాలల్లో పని చేస్తున్న వారికి సర్వీసును అంగీకరిస్తూ, మాతృ విశ్వవిద్యాలయాల్లో బోధన చేస్తున్నవారికి సర్వీసును పరిగణలోకి తీసుకోకపోవడం. వర్సిటీ పరీక్ష పెట్టి, ఇంటర్వ్యూ చేసి పార్ట్ టైమ్ బోధకులను ఎంపిక చేసింది. యూని వర్సిటీలు అధ్యాపకులను ఎంపిక చేసిన ఈ విధానం మంచిది కాదా? తనని తానే దోషి అని పిలుచు కుంటుందా? అనే విషయాలను తేల్చాల్సిన అవసరం ఉంది. అలాగే ఈ జీవోలో ప్రస్తావించిన 'ఎ' దశ స్క్రూటినీ విధానం ఆబ్జెక్టివిటీకి దగ్గరగా ఉంది. కానీ, బి, సి దశల్లో కేటాయించిన మార్కుల విషయంలో సబ్జెక్టివిటీ చోటుచేసుకునే అవకాశం ఎక్కువగా ఉంది. ఉన్నత విద్యా సంస్థల్లో బాధ్యతాయుతమైన అసిస్టెంట్ ప్రొఫె సర్ల నియామకం పారదర్శకంగా, న్యాయంగా జరగాలంటే ఈ జీవోలోని అంశాలను మరింత పారదర్శకంగా తయారు చేయాల్సిన అవసరం ఉంది. అప్పుడు మాత్రమే సమాజం కోరుకుం టున్న బాధ్యతాయుతమైన, సుశిక్షిత, ప్రతిభా వంతమైన అభ్యర్థులు బోధకులుగా మారే అవ కాశం ఉంటుంది. కనుక ఇలాంటి అప్రజాస్వామిక, సహజ న్యాయ సూత్రాలకు వ్యతిరేకంగా ఉన్న మూడు దశల స్క్రీనింగ్ విధానాన్ని, ఇతర అభ్యంతరాలను పరిగణలోకి తీసుకుని, మెరిట్ ఆధారంగా స్క్రూటినీ విధానాలను రూపొందిం చాలి. జీవో నెంబర్ 21ని వెనక్కి తీసుకోవాలి. తెలంగాణ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకానికి ప్రాతిపదికను తయారు చేయాలి.



# విజయ్ వదిలేసిన శర్వా సినిమా

ఒక హీరో చేయాల్సిన సినిమా ఇంకో హీరో చేతికి వెళ్లడం అన్నది సినీ రంగంలో చాలా కామన్ వ్యవహారం. ఇలా చేతులు మారిన సినిమాలు మంచి ఫలితాన్నందుకుని ముందు కథ విన్న హీరోలు చింతించేలా చేస్తుంటాయి. కొన్ని చిత్రాలు ఫెయిలై వాటిని వదులుకున్న హీరోలు హమ్మయ్య అనుకునేలా చేస్తాయి. శర్వానంద్ కెరీర్లో స్పెషల్ ఫిలింగా నిలిచిన 'ఒకే ఒక జీవితం' నిజానికి విజయ్ దేవరకొండ చేయాల్సిన సినిమా అట. తమిళంలో 'కణం' పేరుతో తెరకెక్కి.. తెలుగులో 'ఒకే ఒక జీవితం'గా విడుదలైందీ సినిమా. ముందు దర్శకుడు శ్రీ కార్తీక్ ఈ కథను విజయ్‌కే చెప్పాడట. విజయ్‌కి ఆ కథ విపరీతంగా నచ్చేసిందట.రెండుమూడు సార్లు ఈ కథ విని.. హీరోగా నటించడంతో పాటు స్వయంగా తనే నిర్మించాలని కూడా భావించాడట. మరో నిర్మాత కూడా ఈ సినిమాను ప్రొడ్యూస్ చేయడానికి ముందుకు వచ్చాడట. కానీ ఈ కథకు తాను న్యాయం చేయలేనేమో అనే అనుమానంతో 'ఒకే ఒక జీవితం'ను వదులుకున్నట్లు విజయ్ తెలిపాడు. ఒక ప్రేక్షకుడిగా ఈ కథ విని ఎంజాయ్ చేస్తున్నాం సరే.. తాను అందులో ఫిట్ అవుతానా అని ఆలోచిస్తే.. తన మీద తనకు సందేహం కలిగి ఈ సినిమాను వదులుకున్నట్లు విజయ్ తెలిపాడు. ఇక తన కొత్త చిత్రం 'కింగ్‌డమ్' గురించి చెబుతూ.. ఇది ప్రస్తుతానికి ఫ్రాంఛైజీ మూవీ కాదని చెప్పాడు. అలా అని పార్ట్ 2 రాదనేమీ చెప్పలేమన్నాడు. దీన్ని ఒక కథగా చెప్పాలనే 'కింగ్‌డమ్' అనే టైటిల్ పెట్టామని.. సినిమా రిలీజయ్యాక ప్రేక్షకుల స్పందనను బట్టి పార్ట్ 2 చేయాలా అనేది ఆలోచిస్తామని తెలిపాడు.

# సుమంత్ సినిమాకు ప్రశంసలు



టాలెంట్, రూపం రెండూ ఉన్నప్పటికీ రకరకాల కారణాల వల్ల కెరీర్ ని రెగ్యులర్ గా కొనసాగించలేకపోయిన సుమంత్ 'మళ్ళీ రావా' నుంచి మళ్ళీ ట్రాక్ లోకి వచ్చేశాడు. తర్వాత హిట్లు పెద్దగా లేకపోయినప్పటికీ సార్, సీతా రామం లాంటి వాటిలో వేసిన పాత్రలు మంచి గుర్తింపు తీసుకొచ్చాయి. థియేటర్ ఫుల్ లేకపోయినా సుమంత్ మీద ప్రేక్షకులకు సదాభిప్రాయమే ఉంది. అందుకే ఓటిటి వైపు అడుగులు వేస్తూ ఆడియన్స్ ని ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నాడు. అందులో భాగంగా వచ్చిందే అనగనగా. ఈటీవీ విన్ లో స్ట్రీమింగ్ అవుతున్న ఈ ఎమోషనల్ మూవీకి మొన్న హైదరాబాద్ లో స్పెషల్ ప్రీమియర్లు వేశారు. ఓటిటిలో ఈ సినిమాకు ప్రశంసలు వస్తున్నాయి. విమర్శకులు మెచ్చుకుంటున్నారు. సున్నితమైన విద్యా వ్యవస్థలోని లోపాలను నేపథ్యంగా ఎంచుకున్న దర్శకుడు సన్నీ సంజయ్ దాన్ని తెరకెక్కించిన తీరు భావోద్వేగాలతో నిండిపోయింది. తారే జమీన్ పర్, త్రీ ఇడియట్స్ తరహా బ్యాక్ డ్రాప్ అనిపించినప్పటికీ తెలుగు నేటివిటీని తీసుకుని ఇప్పటి కార్పొరేట్ స్కూళ్లలో జరుగుతున్న పిల్లల మానసిక వ్యాపారాన్ని సునిశితంగా ఎండగట్టిన తీరు ఆకట్టుకునేలా ఉంది. బట్టికొట్టే పాఠాల కంటే కథల ద్వారా ఎదుగుదల బాగుంటుందని నమ్మే పర్సనాలిటీ డెవలప్ మెంట్ టీచర్ పాత్రలో సుమంత్ జీవించారు. బెస్ట్ క్లాసిక్ లాంటి పెద్ద సర్టిఫికెట్లు కాదు కానీ ఎలివేషన్లు, హీరోయిజంతో నిండిపోయిన టాలీవుడ్ తెరకు అనగనగా కొంచెం ఫ్రెష్ ఫీలింగ్ ఇస్తుంది. నటీనటుల నుంచి రాబట్టుకున్న నటన కంటెంట్ ని నెక్స్ట్ లెవెల్ కు తీసుకెళ్లింది. కథనం కొంచెం నెమ్మదిగా సాగినప్పటికీ ఓటిటి వాచ్ కోణంలో చూసుకుంటే ఇది పెద్ద లోపంగా అనిపించదు.

# తగ్ లైఫ్ స్టోరీ బయటికి వచ్చేసిందా



నాయకుడు వచ్చిన 38 సంవత్సరాల తర్వాత కుదిరిన కాంబోగా కమల్ హాసన్ మణిరత్నం నుంచి వస్తున్న తగ్ లైఫ్ మీద ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఒక కల్ట్ క్లాసిక్ ఇచ్చాక ఇంత గ్యాప్ రావడం అరుదని చెప్పాలి. కారణాలు ఏవైనా మూడు దశాబ్దాల తర్వాత ఈ ఇద్దరు చేతులు కలపడం పట్ల ఫ్యాన్స్ సంతోషంగా ఉన్నారు. జూన్ 5 విడుదల కాబోతున్న ఈ గ్యాంగ్ స్టర్ డ్రామా కోసం కమల్ హాసన్ నాన్ స్టాప్ ప్రమోషన్లు చేస్తున్నారు. ఏపీ తెలంగాణతో పాటు దక్షిణాది రాష్ట్రాలన్నీ కవర్ చేసేలా పెద్ద ప్రోగ్రాం ప్లాన్ చేసుకున్నారు. ఇంత వయసులోనూ కమల్ హాసన్ ఓపిక చూసి వావ్ అనకుండా ఉండటం కష్టం. ఇదిలా ఉండగా పలు ఇంటర్వ్యూలలో కమల్ చెప్పిన మాటలను బట్టి తగ్ లైఫ్ స్టోరీకి సంబంధించిన కీలక లీకులు బయటికి వచ్చేశాయి. వాటి ప్రకారం ఈ సినిమాలో ఆయన పేరు రంగరాయ శక్తివేల్ నాయకర్. మాఫియా ప్రపంచాన్ని గడగడలాడిరచిన అతను ఒక తీవ్ర సంఘటనలో చనిపోయాడని అందరూ భావిస్తారు. కానీ ఊహించని పరిస్థితుల్లో తిరిగి వస్తాడు. కొడుకు శింబు అప్పటికే లీడర్ గా పేరు తెచ్చుకుంటాడు. ముందు కలుసుకున్నా క్రమంగా ఇద్దరు శత్రువులుగా మారేలా చేయి దాటిపోతుంది. అక్కడి నుంచి వచ్చే మలుపులు మణిరత్నం స్టైల్ లో ఉక్కిరి బిక్కిరి చేసేలా ఉంటాయని చెన్నై టాక్. కొంచెం ఇదే తరహా బ్యాక్ డ్రాప్ లోనే గతంలో మణిరత్నం నవాబ్ తీశారు. అందులోనూ శింబు ఉన్నాడు. ఇప్పుడు తగ్ లైఫ్ లైన్ దానికి దగ్గరగా అనిపిస్తోంది.



# శ్రీలీల కొత్త సినిమా ఇంత సైలెంటుగానా

హిట్టు ఫ్లాప్ పక్కనపెడితే శ్రీలీల డిమాండ్ మాములుగా లేదు. ఆఫర్లు క్రమం తప్పకుండా వస్తూనే ఉన్నాయి. ఆల్రెడీ కార్తీక్ ఆర్యన్ మూవీ ద్వారా హిందీ తెరంగేట్రంకు రంగం సిద్ధమవుతోంది. మరికొందరు బాలీవుడ్ డైరెక్టర్లు తన డేట్ల కోసం ఎదురు చూస్తున్నారు. ఇంకోవైపు తమిళంలో సుధా కొంగర దర్శకత్వంలో రూపొందుతున్న పరాశక్తిలో నటించడం ద్వారా తనలో పర్ఫార్మర్ ని కూడా చూడొచ్చని ఇన్ సైడ్ టాక్. అఖిల్ లెనిన్ తో పాటు రవితేజ మాస్ జాతర ఈ ఏడాదే థియేటర్లలో అడుగు పెట్టబోతున్నాయి. ఇవన్నీ ఓకే కానీ జనాలు మర్చిపోయిన మరొక సినిమా రిలీజ్ కు రెడీ కావడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఇటీవలే గనుల కేసులో శిక్ష పడి జైలుకు వెళ్లిన కర్ణాటక వ్యాపారవేత్త, మాజీ ప్రజా ప్రతినిధి గాలి జనార్దన్ రెడ్డి కొడుకు కిరిటీ హీరోగా నటించిన జూనియర్ జూలై 18 విడుదల చేయబోతున్నట్టు అధికారికంగా ప్రకటించారు. ఇందులో హీరోయిన్ శ్రీలీల. షూటింగ్ ఎప్పుడో మొదలుపెట్టి ఎప్పుడు పూర్తి చేసారో ఎవరికి తెలియనంత సైలెంట్ గా కానిచ్చేశారు. వారాహి బ్యానర్ పై సాయికొర్రపాటి నిర్మించారు. విశేషం ఏంటంటే కిరిటీ అక్కయ్యగా బొమ్మరిల్లు జెనీలియా నటించగా శాండల్ వుడ్ స్టార్ హీరో రవిచంద్రన్ ఒక ముఖ్య పాత్రను పోషించారు. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం సమకూర్చడం మరో ప్రధాన ఆకర్షణ. అంతేకాదు కెమెరా బాధ్యతలు కేకే సెంథిల్ కుమార్ నిర్వహించగా స్టంట్స్ ని పీటర్ హెయిన్స్ కంపోజ్ చేశారు. ఇంత పెద్ద సెటప్ పెట్టుకుని హడావిడి లేకుండా ఇంత హఠాత్తుగా రిలీజ్ ప్రకటన ఇవ్వడం వెరైటీనే. ట్రైలర్ త్వరలోనే లాంచ్ చేయబోతున్నారు. తండ్రి జైల్లో ఉన్న టైంలో కొడుకు తెరంగేట్రం గురించి చెప్పాల్సి రావడం సినిమాను మించిన డ్రామాగా తోస్తోంది.



# నాని.. ఓపెనింగ్ అదుర్స్.. ఫినిషింగ్ ప్చ్

టాలీవుడ్లో సినిమా సినిమాకూ రేంజ్ పెంచుకుంటున్నాడు నేచురల్ స్టార్ నాని. తన సినిమాల బడ్జెట్లు పెరుగుతున్నాయి. బిజినెస్ పెరుగుతోంది. ఓపెనింగ్‌స్‌లోనూ గ్రోత్ ఉంటోంది. వరుసగా తన సినిమాలకు ప్రి రిలీజ్ బజ్ బాగుంటోంది. అలాగే పాజిటివ్ టాక్ వస్తోంది. ఓపెనింగ్స్‌కు ఢోకా ఉండట్లేదు. 'దసరా'తో మొదలుపెడితే.. 'హాయ్ నాన్న', 'సరిపోదా శనివారం', 'హిట్ 3' ఇలా వరుసగా నాలుగు చిత్రాలకూ పాజిటివ్ టాక్ వచ్చింది. 'హాయ్ నాన్న' పక్కా క్లాస్ మూవీ కావడం వల్ల ఓపెనింగ్స్, కలెక్షన్లు కొంచెం తక్కువ వచ్చాయి కానీ.. మిగతా మూడు సినిమాలూ నాని స్టార్ పవర్‌ను చూపించాయి. తన ఇమేజ్‌ను పెంచాయి. 'దసరా'తో తొలిసారిగా వంద కోట్ల క్లబ్బులోనూ అడుగుపెట్టాడు నాని. ఇప్పుడు 'హిట్ 3'తో మరోసారి ఆ మైలురాయిని అందుకున్నాడు. కానీ నాని సినిమాలకు ఉన్న సమస్యల్లా.. ఆరంభ జోరు తర్వాత డౌన్ అయిపోవడమే. నాని చిత్రాలకు వచ్చే టాక్, ఓపెనింగ్స్ చూస్తే ఫుల్ రన్లో పెద్ద రేంజికి వెళ్తాయనే అంచనాలు కలుగుతున్నాయి. కానీ వీకెండ్ తర్వాత తన సినిమాలు చల్లబడిపోతున్నాయి. అనుకున్నంత జోరు చూపించలేకపోతున్నాయి. ఇప్పుడు చాలా సినిమాల సమస్య ఇదే అయినప్పటికీ.. నానికి ప్రతిసారీ ఈ ఇబ్బంది తప్పట్లేదు. మంచి లాభాలు అందిస్తాయి అనుకున్న సినిమాలు.. చివరికి అతి కష్టం మీద బ్రేక్ ఈవెన్ అందుకోవడం లేదా కొంత మేర నష్టాలు మిగల్చడం కామన్ అయిపోతోంది. 'దసరా'కు ఏపీలో చాలా ఏరియాల్లో బ్రేక్ ఈవెన్ అవ్వలేదు. 'సరిపోదా శనివారం' కూడా ఇదే సమస్యను ఎదుర్కొంది. ఇప్పుడు 'హిట్ 3' పరిస్థితి కూడా ఇంతే అని ట్రేడ్ వర్గాలు అంటున్నాయి.

# 'జూనియర్' వచ్చేది అప్పుడే

ప్రసిద్ధ నిర్మాణ సంస్థ వారాహి చలన చిత్రం, కర్ణాటక మాజీ మంత్రి, ప్రముఖ పారిశ్రామికవేత్త గాలి జనార్ధన్ రెడ్డి కుమారుడు కిరీటి రెడ్డిని "జూనియర్" అనే ఫన్, ఫ్యామిలీ, ఎమోషన్‌తో నిండిన ఎంటర్టైనర్ ద్వారా సినీ రంగంలోకి పరిచయం చేస్తోంది. రాధా కృష్ణ దర్శకత్వంలో, రజని కొర్రపాటి నిర్మించిన ఈ పాన్ ఇండియా చిత్రం ప్రోమోలకే మంచి స్పందన అందుకుంది. కిరీటి తన డైలాగ్ డెలివరీ, స్టైల్, స్క్రీన్ ప్రెజెన్స్‌తో ఆకట్టుకున్నాడు. ఈ చిత్రంలో శ్రీలీల కథానాయికగా కిరీటీకి జోడీగా కనిపించనుంది. అలాగే జెనీలియా కీలక పాత్రలో వెండితెరకు కంబ్యాక్ ఇస్తుండగా, కన్నడ లెజెండ్ క్రేజీ స్టార్ డా. రవిచంద్ర వి కూడా ప్రధాన పాత్రలో నటిస్తున్నారు.ఈ రోజు మూవీ టీం విడుదల తేదీకి సంబంధించిన అప్‌డేట్‌ను రివిల్ చేసింది. జూనియర్ చిత్రం ఈ ఏడాది జూలై 18న థియేటర్లలోకి రానుంది. జూనియర్ ఈ మాన్సూన్ లో కుటుంబంతో కలిసి సరదాగా, భావోద్వేగాలతో జర్నీని అదించబోతోంది. రిలీజ్ డేట్ పోస్టర్ లో ప్రధాన తారాగణం ఆనందంగా కనిపించగా, జెనీలియా మాత్రం సీరియస్ లుక్‌తో కనిపిస్తుంది. త్వరలోనే ప్రామోషన్స్ కిక్ స్టార్ట్ చేస్తారు.ఈ చిత్రానికి ప్రఖ్యాత సాంకేతిక నిపుణులు పనిచేస్తున్నారు. కె కె సెంటిల్ కుమార్ సినిమాటోగ్రఫీను అందించగా, సంగీతాన్ని దేవి శ్రీ ప్రసాద్ అందిస్తున్నారు. ప్రొడక్షన్ డిజైనర్‌గా రవీందర్ పనిచేస్తుండగా, యాక్షన్ సీన్‌లను భారత్‌లోనే అగ్రశ్రేణి స్టంట్ మాస్టర్ పీటర్ హెయిన్ కొరియోగ్రాఫ్ చేస్తున్నారు. డైలాగ్స్‌ను కల్యాణ్ చక్రవర్తి త్రిపురనేని రాయగా, నిరంజన్ దేవరమేనే ఎడిటర్.

# ముంబై ఇండియన్స్‌లోకి ఇద్దరు స్టార్ క్రికెటర్లు



భారత్‌పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలు చల్లబడిన నేపథ్యంలో తాత్కాలికంగా రద్దైన ఐపిఎల్ మళ్లీ ప్రారంభంకానుంది. అయితే కొన్ని కారణాల వల్ల పలువురు విదేశీ ఆటగాళ్లు తిరిగి ఐపిఎల్‌లో పాల్గొనేందుకు రాలేకపోతున్నారు. కొంతమంది ఆటగాళ్లు ముందు చేసుకున్న ఒప్పందం ప్రకారం మే 27 వరకే అందుబాటులో ఉంటామని తేల్చి చెప్పేశారు. ఈ నేపథ్యంలో మెగా వేలంలో అమ్ముడుపోని ఇతర ఆటగాళ్లతో స్వల్పకాలిక ఒప్పందాలు చేసుకొని తమ జట్ల లోకి తీసుకోవడానికి ఫ్రాంఛైజీలకు బిసిసిఐ అనుమతి ఇచ్చింది. ఈ క్రమంలో ముంబై ఇండియన్స్ జట్టు ఇద్దరు ఆటగాళ్లతో ఇప్పటికే ఒప్పందం కుదుర్చుకుంది. ర్యాన్ రికల్టన్, విల్ జాక్స్ వాళ్ల దేశాలకు ప్రాతినిధ్యం వహించాల్సి ఉండటంతో వాళ్ల స్థానంలో జానీ బెయిర్‌స్టో, రిచర్డ్ గ్లీసన్‌ని ముంబై జట్టులోకి తీసుకుంది. బెయిర్‌స్టో గత సీజన్లలో సన్‌రైజర్స్ హైదరాబాద్, పంజాబ్ కింగ్స్ తరఫున ఆడాడు. కానీ, 2025 ఐపిఎల్ వేలంలో అతన్ని తీసుకొనేందుకు ఎవరు ఆసక్తి చూపించలేదు. ఇక రిచర్డ్ గ్లీసన్ 2024 ఐపిఎల్‌లో చెన్నై సూపర్ కింగ్స్ తరఫున రెండు మ్యాచులు మాత్రమే ఆడాడు. మరి రికల్టన్, విల్ జాక్స్‌ల స్థానంలో వస్తున్న బెయిర్‌స్టో, రిచర్డ్ గ్లీసన్ ఏ మేరకు రాణిస్తారో చూడాలి.



# కెరీర్ మొత్తం వివాదాలే.. తొలిసారి ఐపీఎల్‌లో లక్కీ ఛాన్స్

ఐపీఎల్ 2025లో గుజరాత్ టైటాన్స్ జట్టు చాలా మంచి లయలో ఉంది. ఇప్పటివరకు 11 మ్యాచ్‌లు మాత్రమే ఆడి 16 పాయింట్లు సాధించింది. గ్రూప్ దశలో గుజరాత్ టైటాన్స్ ఇంకా 3 మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. కాబట్టి ఆర్‌సీబీ ప్లేఆఫ్స్‌కు చేరుకోవడానికి అతిపెద్ద పోటీదారులలో ఒకటిగా నిలిచింది. ఈ కారణంగా జట్టు ఇప్పటికే ప్లేఆఫ్స్ కోసం తన సన్నాహాలను ముమ్మరం చేసింది. నిజానికి, ఆర్‌సీబీ స్టార్ వికెట్ కీపర్ బ్యాట్స్‌మన్ జోస్ బట్లర్ ప్లేఆఫ్ మ్యాచ్‌లకు అందుబాటులో ఉండడు. గుజరాత్ కూడా అతని స్థానంలో ఆటగాడిని ప్రకటించింది. వివాదాలతో సుదీర్ఘ చరిత్ర ఉన్న బట్లర్ స్థానంలో గుజరాత్ ఒక ఆటగాడిని ఎంపిక చేయడం గమనార్హం. గుజరాత్ టైటాన్స్ జట్టులో జోస్ బట్లర్ స్థానంలో శ్రీలంక వికెట్ కీపర్ బ్యాట్స్‌మన్ కుశాల్ మెండిస్‌ను చేర్చుకున్నట్లు ప్రకటించింది. కుసల్ మెండిస్ మే 26న గుజరాత్ జట్టులో చేరనున్నాడు. ఈ కారణంగా అతను పాకిస్తాన్ సూపర్ లీగ్ నుంచి నిష్క్రమించాలని నిర్ణయించుకున్నాడు. నిజానికి, నూూ 2025లో, అతను క్వెట్టా గ్లాడియేటర్స్ తరఫున ఆడుతున్నాడు. కానీ, ఐపీఎల్ లాగానే, పీఎస్ఎల్ సస్పెన్షన్ తర్వాత, అతను తన దేశానికి తిరిగి వచ్చాడు. ఇప్పుడు పీఎస్ఎల్‌ను వదిలి ఐపీఎల్‌లో ఆడాలని నిర్ణయించుకున్నాడు. అతను తొలిసారి ఐపీఎల్‌లో భాగం కాబోతున్నాడు. కుశాల్ మెండిస్‌కు వివాదాలతో సుదీర్ఘ చరిత్ర ఉంది.

# ఐపిఎల్ 2.0కు సర్వం సిద్ధం

భారత్, పాకిస్థాన్ దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో అర్ధాంతరంగా నిలిచి పోయిన ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపిఎల్) సీజన్ 2025 శనివారం పునఃప్రారంభం కానుం ది. మధ్యలోనే ఆగిపోయిన ఐపిఎల్‌ను సరికొత్త షెడ్యూల్‌తో తిరిగి నిర్వహించనున్నారు. శనివారం ప్రారంభమయ్యే ఐపిఎల్ రెండో దశ జూన్ 3న జరిగే ఫైనల్‌తో ము గుస్తోంది. ఈసారి లీగ్ దశతో కలుపుకుని మొత్తం 17 మ్యాచ్‌లు జరుగనున్నాయి. లీగ్ దశలో 13 మ్యాచ్‌లు ఉండగా నాలుగు ప్లేఆఫ్ మ్యాచ్‌లు ఉన్నాయి. రెండో దశ ఐపిఎల్‌ను ఏడు వేదికల్లో నిర్వహించనున్నారు. బెంగళూరు, లక్నో, ఢల్లీి, ముంబై, కోల్‌కతా, జైపూర్,అహ్మదాబాద్‌లు ఈసారి ఐపిఎల్ మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇవ్వనున్నాయి. చెన్నై,హైదరాబాద్, చండీగఢ్ నగరాలకు ఐపిఎల్ మ్యాచ్‌లు నిర్వహించే అవకాశం దక్కలేదు. హైదరాబాద్, చెన్నైలలో జరగాల్సిన మ్యాచ్‌లను ఇతర వేదికలకు మార్చా రు. అంతేగాక ప్లేఆఫ్ మ్యాచ్‌లు కూడా ముం దుగా ప్రకటించిన వేదికల్లో కాకుండా ఇతర చోట్ల నిర్వహించాలని బిసిసిఐ భావిస్తున్నట్టు సమాచారం. ఇక రెండో దశ ఐపిఎల్ మ్యాచ్‌ల కోసం బిసిసిఐ భారీ ఏర్పాట్లు చేసింది. శనివారం జరిగే తొలి మ్యాచ్‌లో డిఫెండిరగ్ ఛాంపియన్ కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తలపడనుంది. ఆదివారం జరిగే మ్యాచుల్లో ఢల్లీిక్యాపిటల్స్‌తో గుజరాత్ జెయింట్స్, రాజస్థాన్ రాయల్స్‌తో పంజాబ్ కింగ్స్ తలపడుతాయి. గుజరాత్ మ్యాచ్‌కు ఢల్లీి, పంజాబ్ మ్యాచ్‌కు జైపూర్ ఆతిథ్యం ఇస్తున్నాయి. సన్‌రైజర్స్ హైదరాబాద్ మరో మూడు లీగ్ మ్యాచ్‌లు ఆడనుంది. మే 19న లక్నోతో, మే 23న బెంగళూరుతో హైదరాబాద్ ఆడుతుంది. ఇక మే 25న ఢల్లీిలో కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో తలపడుతుంది. తొలి దశ షెడ్యూల్‌లో కోల్‌కతాతో ఉప్పల్ స్టేడియంలో మ్యాచ్ జరగాల్సి ఉంది. సవరించిన షెడ్యూల్ ప్రకారం ఈ మ్యాచ్ ను ఢల్లీికి మార్చారు. ధర్మశాలలో ఢల్లీి, పంజాబ్ జట్ల మధ్య అర్ధాంతరంగా నిలిచి పోయిన మ్యా చ్‌ను మళ్లీ మొదటి నుంచి నిర్వహించనున్నారు.



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# పిల్లలమర్రి విహారానికి మిస్ వరల్డ్ అందాల సందడి

వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు: మహబూబ్నగర్ జిల్లా కేంద్రంలోని 7 శతాబ్దాలకు పైగా చరిత్ర ఉన్న పిల్లలమర్రిలో ప్రపంచ అందాల భామలు సందడి చేశారు. హైదరాబాదులో నిర్వహిస్తున్న ప్రపంచ సుందరి పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన ఓ బృందం పిల్లలమర్రిని శుక్రవారం సందర్శించారు.హైదరాబాద్ నుంచి ప్రత్యేక బస్సులో బయలుదేరి సాయంత్రం 5 గంటలకు మహబూబ్ నగర్ కు చేరుకున్నారు. తెలంగాణ పండుగల విశిష్టత సంస్కృతిని ప్రతిబింబించేలా సాంప్రదాయ నృత్యాల మధ్య సుందరీమణుల బృందానికి స్వాగతం పలికారు. మొదట శ్రీ రాజరాజేశ్వరి సమేత రామలింగేశ్వర స్వామిని దర్శించుకున్నారు.అనంతరం మ్యూజియాన్ని సందర్శించారు. కాసేపు ఉత్సాహంగా బతుకమ్మ ఆడారు. గిరిజన యువతుల బంజారా నృత్యం చేయగా,మిస్ వరల్డ్ కంటెస్టెంట్లు వారితో జత కలిశారు. తర్వాత పిల్లలమర్రి మహావృక్షాన్ని వీక్షించారు.చెట్టు యొక్క చరిత్ర, మహావృక్షం పునరుజ్జీవనం గురించి అటవీ శాఖ అధికారి వారికి వివరించారు. ముఖ్య తిధులుగా తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్ శాఖ,పర్యాటక సాంస్కృతిక శాఖ. పురాస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు. ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి తమ్ముడు కొడంగల్ ఇన్చార్జ్ ఏనుముల తిరుపతి రెడ్డి పాల్గొన్నరు. ఈ కార్యక్రమంలో మహబూబ్నగర్ స్థానిక శాసన సభ్యులు యెన్నం శ్రీనివాస్ రెడ్డి దేవరకద్ర స్థానిక శాసన సభ్యులు జి. మధుసూదన రెడ్డి, కల్వకుర్తి స్థానిక శాసన సభ్యులు కసిరెడ్డి నారాయణ రెడ్డి,మక్తల్ శాసన సభ్యులు వాకిటి శ్రీహరి,నారాయణపేట శాసన సభ్యురాలు పర్లిక రెడ్డి.షాద్నగర్ శాసన సభ్యులు వీరంపల్లి శంకర్, గద్వాల స్థానిక శాసన సభ్యులు బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి. మహబూబ్నగర్ మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ కుమార్ గౌడ్,జిల్లా కలెక్టర్,జిల్లా ఎస్పీ తదితర శాఖ అధికారులు పాల్గొన్నారు.









# ఉప్పల్ కురుమ భవనానికి భూమిపూజ చేసిన ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

**ఉప్పల్,తెలంగాణ ముచ్చట్లు:**

కురుమ కుల ఆత్మగౌరవానికి ప్రతీకగా, చిరస్థాయిగా నిలిచే విధంగా ఉప్పల్ కురుమ సంఘం భవన నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. సుమారు 450 ఏళ్ల చరిత్ర కలిగిన ఉప్పల్ బీరప్ప స్వామి దేవాలయం పరిసరాల్లోని బీరప్పగడ్డలో ఈ భవన నిర్మాణం చేపడుతున్నారు. ఈ కార్యక్రమంలో ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య, ఉప్పల్ డివిజన్ కార్పొరేటర్ రజితా పరమేశ్వర్ రెడ్డి, కురుమ సంఘ నాయకులు పాల్గొని భూమిపూజ నిర్వహించారు.ఈ సందర్భంగా రాష్ట్ర కురుమ సంఘ అధ్యక్షుడు ఎగ్గె మల్లేశం, క్యామ మల్లేష్, గొరిగే రమేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొరిగే మల్లేష్, రేవు కృష్ణ, పెద్ద మల్లేశ్, కొల్లు బాలరాజ్, ఎల్లు గుట్ట దేవాలయం చైర్మన్ జన్ని రఘు, ఉప్పల్ కురుమ సంఘ అధ్యక్షుడు చిందం వెంకటేష్, బర్ల కృష్ణ, గొరిగి ఐలయ్య, షల్ఫోజి కర్రె శ్రీనివాస్, శాఖ పెంటయ్య, ఎర్ర శ్రీనివాస్ పాల్గొన్నారు. మహిళా అధ్యక్షురాలు సోము బాలమణి, బండారి మంజుల, కెమిడి ఇంద్ర, యువజన నాయకులు ముత్యం, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.





# ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నేటి పర్యటన వివరాలు

**షాద్నగర్, తెలంగాణ ముచ్చట్లు:**

షాద్నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ శనివారం కేశంపేట మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఉదయం ఎక్లాస్ ఖాన్ పేట్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమిపూజ నిర్వహించి, నివాసల కలతో ఎదురు చూస్తున్న పేద కుటుంబాలకు మద్దతుగా ప్రభుత్వం కొనసాగిస్తున్న కార్యక్రమాలను వివరించారు. అనంతరం బైర్ఖాన్ పల్లి గ్రామంలో జరిగిన భూమిపూజలోనూ పాల్గొన్నారు. తరువాత మధ్యాహ్నం షాద్నగర్ మున్సిపాలిటీ కాన్ఫరెన్స్ హాల్లో మైక్రోసాఫ్ట్, యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన స్కిల్ డెవలప్మెంట్ రెండో బ్యాచ్ విద్యార్థుల స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై, విజేతలకు అభినందనలు తెలుపుతారు.



Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in